Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 206 పేజీలు 8 వెల : 5 బుధవారం 18 ఫిబ్రవరి 2026








## అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి

### అలా రానివారిని రీకాల్ చేయాల్సిందే

### ఎపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిట్‌చాట్ చేశారు. అయితే, విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలంటూ పిలుపునిచ్చారు.. అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి అని స్పష్టం చేశారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కొందరు సభ్యులు సభకు హాజరుకాకుండానే జీతాభత్యాలు తీసుకుంటున్నారని.. సభకు హాజరుకాని సభ్యులకు జీతం కట్ చేయాలి కదా? అని ప్రశ్నించారు.. ఈ అంశాలన్నీ జాతీయ స్థాయిలో చర్చ చేపట్టామని? ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉందన్నారు. ఇక, అసెంబ్లీలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పని చేస్తోందన్నారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కాగా, తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. మొక్కుబడిగా.. అసెంబ్లీ ప్రారంభమైన తొలిరోజు హాజరై.. ఆ తర్వాత సమావేశాలకు దూరంగా ఉంటున్నారు.. మండలికి హాజరైన శాసన సభకు మాత్రం హాజరుకాకపోడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పలు సందర్భాల్లో ఎమ్మెల్యేల హాజరు విషయంపై చంలన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే..

# తీరంలో యుద్ధ నౌకల జాతర

విశాఖపట్నం;
సింధియా,న్యూస్‌టుడే: ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి విశాఖ ఈఎన్‌సీ ఆఫీసర్స్ మెస్‌లో విందు (ప్రెసిడెన్షియల్ బాంక్వెట్) ఇచ్చారు. ఈ అంతర్జాతీయ ఉత్సవానికి హాజరవుతున్న వివిధ దేశాల నేవీ చీఫ్‌లకు దేశ రక్షణ దళాల సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి విందు ఇవ్వడం ఆనవాయితీ. ఈ విందుతో ఐఎఫ్ఆర్ లాంఛనంగా ప్రారంభమైనట్లు భావిస్తారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విశాఖ పోర్టు డిప్యూటీ ఛైర్మన్ రోషిణి అపరంజి, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ నేవల్ అధికారులు, ఫ్లీట్ కమాండర్లు, డీజీసీజీ, సీజీసీ(ఈఎస్), ఇతర కమాండర్లతో రాష్ట్రపతి గ్రూప్ ఫొటో దిగారు.

అంతకుముందు దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు స్వాగతం పలికారు.



# సంచలనం రేపిన మదనపల్లి ఘటన

అమరావతి: మదనపల్లిలో జరిగిన దారుణ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని పేర్కొంటూ, బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధించి ముందుగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో



తనను ట్యాగ్ చేశారని అనిత తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రాథమిక విచారణలో ముద్దాయి డ్రగ్స్ లేదా గంజాయి సేవించలేదని, అయితే మితిమీరిన మద్యం సేవించినట్లు గుర్తించామని వెల్లడించారు. మొదట బాలిక అదృశ్యమై ఉండవచ్చని అనుకున్నామని, కానీ స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టి బాలిక మృతదేహాన్ని ఆమె ఇంటి ఎదురుగా గుర్తించారని తెలిపారు. నిందితుడిని తమకు అప్పగించాలని స్థానికులు ఆందోళనకు దిగారని హోంమంత్రి చెప్పారు. అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండటంతో, విచారణకు ఆటంకం కలగకుండా బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకి రలించారు. అలాగే నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అతడు బెయిల్‌పై బయటకు రాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇటువంటి ఘటనలపై తమ ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. కాగా, మదనపల్లిలో చిన్నారి హత్య కేసు ఉద్రిక్తతకు దారి తీసింది. చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తీసుకెళ్లేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు అడ్డుకుంటూ ఆందోళనకు దిగారు. నిందితుడిని తమకు అప్పగించాలని, లేకపోతే ఎన్‌కౌంటర్ చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీ సహా ఇతర పోలీసు అధికారులు స్థానికులతో చర్చలు జరిపారు.. ఆందోళన కారణంగా చెన్నై?ముంబై జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని కచ్చితంగా కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేస్తామంటూ ఎస్పీ విశ్వనాథ్ స్థానికులకు వివరించే ప్రయత్నం చేస్తున్న స్థానికులు ఆందోళన విరమించక పోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

**నాణ్యమైన విద్యాసంస్థలకు నెలువుగా నగరం**

**జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు**

**రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం**

**బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సిఎం రేవంత్**



హైదరాబాద్: హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు. హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు. సైన్స్, ఎఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యమన్నారు. ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అలాంటి వాతవరణాన్ని కల్పిస్తుంది. దీనికి సమాధానం హైదరాబాదేనని అన్నారు. బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. మేము కేవలం భారత దేశంలోనే పోటీ పడటం లేదు, ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందన్నారు. ఇప్పుడు మనం కలిసి దీన్ని సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని చెప్పారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టండి,మీ ఉఅఅలను స్థాపించండి, ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించం డని కోరారు. మాలిక్యూల్స్ , ఔషధాలను డిజైన్ చేయండి , క్లినికల్ అనలిటిక్స్‌ను నడపండి, ఎఐ ఎ÷-లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయండి, డిజిటల్ తయారీని ముందుకు తీసుకెళ్లండని వెల్లడించారు. మా ప్రభుత్వం, అధికారులు, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయానికి భాగస్వాములుగా ఉంటారని సీఎం రేవంత్ తెలిపారు. మనమంతా కలిసి పనిచేస్తే హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుండి ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుందని తెలిపారు. ప్రపంచానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం.. తెలంగాణ ఎదుగుతోంది..

# బయో వరల్డ్‌గా తెలంగాణరాష్ట్రం




పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వటైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వటైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ ఉండాలన్నారు. జంక్షన్‌ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జీహెచ్‌ఎంసీ విభజన విషయంలో తలెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

హైదరాబాద్: టాలీవుడ్‌తో పాటు ఇతర చిత్ర పరిశ్రమలను వణికించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' వ్యవస్థాపకుడు రవికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ బెయిల్ సాధారణంగా కాకుండా అత్యంత కఠినమైన నిబంధనలతో కూడి ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా సాగుతున్న విచారణ అనంతరం, ఆయనకు ఉపశమనం కలిగిస్తూ బెయిల్ మంజూరు చేస్తూ, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కోర్టు పలు ఆంక్షలు విధించింది.ప్రధానంగా రవి ఇంటర్నెట్ వినియోగంపై కోర్టు పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించింది. ఆయన ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే కేవలం పోలీసుల ముందస్తు అనుమతితో మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. దీనితో పాటు నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా కట్టడి చేస్తూ, ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. భద్రతా చర్యల్లో భాగంగా రవి తన పాస్‌పోర్ట్‌ను వెంటనే కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే వాటిని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తూ చిత్ర పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టాన్ని చేకూర్చారనే ఆరోపణలపై రవి అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున, ఆయన మళ్లీ వెబ్‌సైట్ నిర్వహణ లేదా పైరసీ పనులు చేపట్టకుండా ఉండేందుకే కోర్టు ఇంటర్నెట్‌పై ఇటువంటి అరుదైన , కఠినమైన ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ం

## 101 కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

హైదరాబాద్: శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని కొల్లూరులో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని శేర్లింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా గంజాయిని నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ సిబ్బంది సంయుక్తంగా అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్వ జగన్నాథం (37), పల్లపు లక్ష్మీనారాయణ (52) అనే వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి వ్యాపారానికి అలవాటు పడ్డారన్నారు. ఒడిశాకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి సుమారు 101.7 కిలోల గంజాయిని తెప్పించి, తెల్లాపూర్ పరిధిలోని శిల్పా వెంచర్ సమీపంలో కార్మికుల క్యాంపుల వద్ద విక్రయించేందుకు నిల్వ చేశారని పేర్కొన్నారు.ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడి నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 25.72 లక్షల విలువైన గంజాయితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు రాజు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కొల్లూరు సీఐ గణెలిష్ పటేల్, ఎస్ఓటీ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. గంజాయి లేదా మాదకద్రవ్యాల సరఫరాపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా సైబరాబాద్ ఎన్‌డీపీఎస్ సెల్ వాట్సాప్ నంబర్ 9490617444కు ఫిర్యాదు చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.ం

## లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

మహబూబాబాద్: ఉత్కంఠకు తెరదించుతూ తొర్రూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం జరిగిన హోరాహోరీ పోరులో చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇరు వర్గాల బలాబలాలు సమానంగా ఉండటంతో అధికారులు 'లక్కీ డ్రా' పద్ధతిని అనుసరించారు. ఈ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థి, రెండో వార్డు సభ్యుడు శ్రవణ్ కుమార్ విజేతగా నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన పేరును అధికారికంగా ప్రకటించి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీని దక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, బీఆర్ఎస్ క్యాంప్‌లో విషాదం నెలకొంది. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డుల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలుచుకోగా.. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ కడియం కావ్యల ఎక్స్‌అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ సంఖ్య 9కి పెరిగింది. రెండు పార్టీల బలాలు సమానం కావడంతో అధికారులు లాటరీ ద్వారా చైర్మన్‌ను నిర్ణయించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో ఓటు చెల్లదంటూ బీఆర్ఎస్ శ్రేణులతో ఆందోళనకు దిగిన దయాకర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను నర్సింహులుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు.అయితే, తన రాజకీయ కంచుకోటగా భావించే తొర్రూరు మున్సిపాలిటీ చేజారిపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తల కష్టాన్ని తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రాణాలకు తెగించి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేను ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలని అంటూ ఆయన కంటతడి పెట్టారు. నాయకులు కేసీఆర్ అంటే ప్రజల్లో ఎంత అభిమానం ఉన్నా, అధికార పార్టీ సాగిస్తున్న అరాచకాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని ఎర్రబెల్లి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి పనిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి ముగింపు పడుతుందని ఆయన హెచ్చరించారు.

## సినీ నటి ప్రత్యూష మృతి కేసులో.. సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్ష ఖరారు

దిల్లీ: రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డికి తెలంగాణ హైకోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. మిగిలిన కాలానికి జైలుశిక్ష అనుభవించడానికి వీలుగా నాలుగు వారాల్లోపు లొంగిపోవాలని ఆదేశించింది. అదే సమయంలో అతని శిక్షను పెంచాలని కోరుతూ ప్రత్యూష తల్లి సరోజినీదేవి దాఖలుచేసిన అప్పీల్‌నూ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మంగళవారం జస్టిస్ రాజేష్‌బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతోకూడిన ధర్మాసనం 60 పేజీల తీర్పు వెలువరించింది. 2002 ఫిబ్రవరిలో జరిగిన ఈ సంఘటనపై ట్రయల్ నిర్వహించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఇందులో నిందితుడు సిద్ధార్థరెడ్డికి ఐపీసీ 306 (ఆత్మహత్యకు పురికొల్పడం), 309 (ఆత్మహత్యకు ప్రయత్నించడం) సెక్షన్ల కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ 2004 ఫిబ్రవరి 23న తీర్పు చెప్పారు. దాన్ని సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా... జైలుశిక్షను రెండేళ్లకు తగ్గించి, జరిమానాను రూ.50 వేలకు పెంచుతూ 2011 డిసెంబరు 28న తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అటు నిందితుడు, అతడికి విధించిన శిక్షను పెంచాలంటూ ఇటు సరోజినీదేవి 2012లో సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. గత ఏడాది నవంబరు 19న తీర్పు రిజర్వ్ చేసిన సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం దాన్ని వెలువరించింది. ప్రత్యూష పురుగుల మందు తాగడంవల్లే చనిపోయారు తప్పితే ఆమెది హత్య కాదని స్పష్టంచేసింది. "రికార్డుల్లో ఉన్న ఆధారాలను లోతుగా పరిశీలించినప్పుడు ఆమె ఆర్గానోఫాస్ఫేట్ విషం తాగడంవల్లే మరణించినట్లు స్పష్టమవుతోంది. ఆమెపై సిద్ధార్థరెడ్డి అత్యాచారానికి పాల్పడినట్లు నిరూపితంకాలేదు. పురుగుల మందు ప్రాణాంతకం అని తెలిసీ సిద్ధార్థరెడ్డి దాన్ని కొనుగోలుచేసి ఇద్దరూ కలిసి తాగేలా మృతురాలిని పురిగొల్పాడు. అతని దోషిత్వం పూర్తిగా నిరూపితమైంది" అని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి 1993లో హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. ఇంటర్ పూర్తయిన తర్వాత సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌కు వెళ్లగా, ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లారు. ఇద్దరి వివాహానికి ప్రత్యూష తల్లి మొదట వ్యతిరేకించినా తర్వాత అంగీకరించారు. సిద్ధార్థరెడ్డి తల్లి మాత్రం ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం వారి వివాహానికి అడ్డంకిగా మారింది. ఆ విషయాన్ని సిద్ధార్థరెడ్డి 2002 ఫిబ్రవరి 23న ఫోన్‌ద్వారా ప్రత్యూషకు చెప్పాడు. సాయంత్రం 5 గంటల సమయంలో పంజాగుట్టలో బ్యూటీపార్లర్‌లో ఉన్న ప్రత్యూషను వెంటబెట్టుకొని కారులో బయటికి వెళ్లాడు. రాత్రి 7.30–8 గంటల మధ్యలో ఇద్దరూ ప్రాణాపాయస్థితిలో బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి వచ్చి చేరారు. ప్రత్యూష 24వ తేదీన కన్నుమూశారు. సిద్ధార్థరెడ్డి మార్చి 9న డిశ్చార్జి అయ్యాడు. 'ఆమెను గొంతు నులిమి చంపేసినట్లు ప్రత్యూషకు తొలుత పోస్టుమార్టం చేసిన గాంధీ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డా.బి.మునుస్వామి నివేదిక ఇచ్చారు. ఆ రోజు విధుల్లో డా.కృపాల్‌సింగ్ ఉన్నప్పటికీ.. ఎవరూ



పిలవకపోయినా వచ్చి మునుస్వామి పోస్టుమార్టం నిర్వహించారు. ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి కూడా తీసుకోలేదు' అని న్యాయస్థానం పేర్కొంది. ఈ పోస్టుమార్టం నివేదికపై వివాదం రేగడంతో ఏపీ ప్రభుత్వం దానిపై ఉస్మానియా ఆసుపత్రి, సిద్ధార్థమెడికల్ కాలేజీ, మెటర్నిటీ ఆసుపత్రులకు చెందిన ముగ్గురు డాక్టర్ల బృందంతో పాటు, దిల్లీ ఎయిమ్స్‌లోని ఫోరెన్సిక్ మెడిసిన్ బృందంతో అధ్యయనం చేయించింది. రెండు బృందాలు అత్యాచారం, హత్య ఆరోపణలను తోసిపుచ్చాయి. చికిత్స సమయంలో అయిన గాయాలను అత్యాచార గాయాలుగా డా.మునుస్వామి ప్రకటించినట్లు తెలిపాయి. దీని ఆధారంగానే సీబీఐ దర్యాప్తు నిర్వహించింది. నిందితుడిపై సెక్షన్ 306, 309 కింద ఛార్జిషీట్ దాఖలు చేసింది.

**మునుస్వామి ఇచ్చిన పోస్ట్‌మార్టం నివేదికపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

ప్రత్యూషపై లైంగిక దాడి చేసి గొంతు నులిమి చంపేశారని డాక్టర్ మునుస్వామి తప్పుడు నివేదిక ఇచ్చారని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో తీవ్రంగా ఆక్షేపించింది. దాని ద్వారా ఆయన అనవసరంగా వివాదాన్ని రాజేశారని పేర్కొంది. ఆయన అభిప్రాయాల ఆధారంగా వచ్చిన మీడియా కథనాలు దర్యాప్తు సిబ్బందిపై తీవ్ర అనుమానాలను రేకెత్తించినట్లు అభిప్రాయపడింది. "ఒక తప్పు నివేదికను తొందరపడి ప్రచురిస్తే అది ప్రజాభిప్రాయాన్ని ఎలా తప్పుదోవ పట్టించగలదో, న్యాయ ప్రక్రియ గమనాన్ని ఎలా దారి మళ్లించగలదో చెప్పడానికి ఇదో ఉదాహరణ. ఒక వైద్యుడు తప్పుడు పోస్ట్‌మార్టం నివేదికను ఇచ్చి, దాన్ని మీడియా ద్వారా ప్రచారం చేయడంవల్ల దర్యాప్తు సంస్థల నమ్మకాన్ని దెబ్బతీయడంతోపాటు.. పోలీసు, న్యాయ వ్యవస్థలపై ఉన్న విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేస్తుంది. ఈ దుష్ప్రభావం కేవలం ఈ కేసుకే పరిమితంకాదు... వైద్యం, చట్టం, పరిపాలన వ్యవస్థలపై ఉన్న నమ్మకాన్ని.. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీస్తుంది. డాక్టర్ మునుస్వామి ప్రవర్తన కోర్టు ధిక్కరణ, వైద్య విలువల ఉల్లంఘన కిందికి వస్తుంది. ఆయన ఇప్పటికే చనిపోయినందున ఆయనపై తదుపరి చర్యలు చేపట్టడంలేదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. సిద్ధార్థరెడ్డి వాదనలను తోసిపుచ్చిన కోర్టు సిద్ధార్థరెడ్డి సీఆర్‌పీసీ సెక్షన్ 313 కింద ఇచ్చిన వాంగ్మూలాన్ని కోర్టు తోసిపుచ్చింది. ప్రత్యూష మృతిలో అతని పాత్ర గురించి దండిగా సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ వాంగ్మూలంలో అతడికి ఆమెతో ఉన్న సంబంధాన్ని ఖండించాడని పేర్కొంది. ఆమెను కేర్ ఆసుపత్రిలో చేర్చిన విషయాన్ని కూడా అంగీకరించలేదని తెలిపింది. సిద్ధార్థరెడ్డి స్వయంగా దుకాణానికి వెళ్లి నువాక్రాన్ పేరు చెప్పి మరీ కొనుగోలు చేయడాన్ని బట్టి చూస్తే దాని విష తీవ్రత గురించి.. అది తాగితే చనిపోతామని తెలిసీ తీసుకున్నట్లు స్పష్టమవుతోందని కోర్టు తెలిపింది.

## రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం భాజపానే

హైదరాబాద్: పురపాలిక ఎన్నికల్లో భాజపా కరీంనగర్ కార్పొరేషన్, నారాయణపేట మున్సిపాలిటీలను కైవసం చేసుకుందని, భవిష్యత్తులో రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా శ్రేణులు శ్రమించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం భాజపా మాత్రమేనని ఈ ఎన్నికలతో రుజువైందన్నారు. మంగళవారం 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్–2026' రాష్ట్రస్థాయి కార్యశాలను భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ మహాభియాన్ ప్రధాన ఉద్దేశం ప్రతి కార్యకర్తను సిద్ధాంతపరంగా దృఢంగా తయారుచేయడం, రాబోయే ఎన్నికలకు సంస్థాగతంగా సిద్ధం కావడం, తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడమేనని తెలిపారు. 'ఇన్నాళ్లు భైంసా మా గడ్డ' అని జబ్బలు చరుచుకుంటూ వస్తున్న వారి అహంకారాన్ని భాజపా బద్దలుకొట్టిందన్నారు. పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని తెలిపారు. కార్యశాలలో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్.గౌతం రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాజపా సాధించిన ఫలితాలపై మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో

పార్టీ నేతలు అంతర్గత సమీక్ష నిర్వహించారు. రామచందర్‌రావు నేతృత్వంలో జరిగిన ఈ సమీక్షలో అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. 'ఇతర పార్టీల వారు భారీగా డబ్బులు పంచి విజయం సాధించారు. భాజపా మాత్రం సంస్థాగతంగా పార్టీ బలంతోనే సీట్లు సాధించింది. అనేక చోట్ల రెబల్స్ వల్లే సీట్లు కోల్పోయాం' అని పార్టీ నేతలు వివరించినట్టు సమాచారం.

## క్యూర్ పరిధిలోఇందిరమ్మ ఇండ్లు




హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడు తున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్దిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్దిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిధిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని

అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు

జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్దిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల

స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్దిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## ముమ్మాటికీ కెసిఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కెటిఆర్



హైదరాబాద్: బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు

మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు.

కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటెర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి ÷టైర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి'గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్య్రం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపితగా ప్రజలు పిలుచుకుంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్తున్నాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళ తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు తెలుసనన్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# కేటీఆర్‌పై వేధింపులు ఆపాలి



రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కక్ష సాధింపు చర్యలకే పరిమితమైందని బీఆరస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శిం చారు. హరీశ్‌రావును, కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ సిట్ నోటీసులు పంపడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యే అని అన్నారు. బొగ్గు కుంభకోణం మంటల నుండి తన కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్‌రెడ్డి ఆడుతున్న డ్రామా అని ఎద్దేవా చేశారు. తన ఒంటికి అంటుకున్న బొగ్గు మరకలను కేటీఆర్‌కు పంపిన నోటీసు కాగితాలతో తుడిచేసుకోవాలని చూడటం ఆయన వెర్రితనమని అన్నారు. వేల కోట్ల రూపాయల బొగ్గు స్కామ్ రాష్ట్రాన్ని కుదిపేస్తున్నది. దీనిపై ప్రజల్లో జరుగుతున్న చర్చను దారి మళ్లించడానికి, పాతబడి తుప్పు పట్టిన ఫోన్ ట్యాపింగ్ అస్త్రాన్ని రేవంత్‌రెడ్డి మళ్ళీమళ్ళీ ప్రయోగిస్తున్నారని తెలిపారు. అందుకే ఆయనకు డైవర్షన్ కింగ్ అనే బిరుదు వంద శాతం సరిపోతుంది. ఇప్పటికైనా ఈ చిల్లర రాజకీయాలు, డ్రామాలు కట్టిపెట్టి ప్రజలకు మేలు చేసే పనుల మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు.

## నైనీ కోల్ టెండర్ల ఎఫెక్ట్.. సింగరేణి కేంద్ర బృందం

తెలంగాణలో సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నైనీ కోల్ బ్లాక్ వివాదం పై విచారణకు కేంద్ర బృందాన్ని సింగరేణికి పంపిచనున్నట్టు తాజాగా ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో కేంద్రం బృందం.. తెలంగాణలో పర్యటించనుంది. కాగా, నైనీ కోల్ బ్లాక్ విషయంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు.. ఇద్దరు సభ్యుల కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించ నుంది. ఈ వివాదానికి, టెండర్ రద్దు చేయడానికి గల కారణాలను, ఇతర అంశాలపైనా ఈ బృందం సింగరేణి అధికారులతో కలిసి విచారించనుంది. ఈ బృందంలో కేంద్ర బొగ్గు శాఖ, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, డైరెక్టర్ టెక్నికల్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు.

## జీవో 190ని పూర్తిగా అమలు చేయాలి..



రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగేలా ఇచ్చిన జీవో 190 ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని టీపీయూఎస్ ప్రభుత్వాన్ని కోరింది. టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వొద్నాల రాజశేఖర్, తెల్కలపల్లి పెంటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ హన్మంత్ రావులు గురువారం సచివాలయ ంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు గారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. జీవో 25 తో ముడిపెట్టకుండా ఆ జీవో ను ప్రత్యేకంగా అమలు చేయాలని పేర్కొన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు తాత్కాలిక ఉపశమనం కోసం ప్రభుత్వ ం చేసిన 190 జీవో ను వెంటనే అమలు పరచాలని కోరారు.

## బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి అప్పులు పెరిగాయి



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్?రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు. సింగరేణిపై కేంద్రం అజమాయిషీ ఎప్పుడూ లేదు. నిధులు లేక జిల్లాలకు రూ.1500 కోట్ల డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ఇవ్వలేదు. బీఆరస్ హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రూ.32వేల కోట్లకుపైగా సింగరేణి అప్పులు పెరిగాయి. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా సీఎండీని మరో 4 ఏళ్లు అదనంగా కొనసాగించారు. ప్రస్తుతం సింగరేణిలో ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడుపుతున్నారు" అని కేంద్ర మంత్రి విమర్శించారు.

# తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమావేశాల్లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... యువతకు ఏఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఓయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు.

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన



కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్స న్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్ యూని వర్సిటీకి చెందిన ఏఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ తో కుదిరిన ఎంఓయూ ద్వారా స్టార్టప్ల అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు.

## పేదల భూములను లాక్కుంటే ఊరుకోం



రంగారెడ్డి జిల్లా: ల్యాండ్ పూలింగ్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా పేదల భూములను లాక్కుం టుందని బీఆరస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి డా.ఆరస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భూములు ఎందుకు తీసుకుంటు న్నారంటూ నిలదీశారు. ఏం కంపెనీలు పెడతారు ఎలాంటి అభివృద్ధి చేస్తారో చెప్పకుండా పేదలను మోసం చేసి అన్యాయంగా విలువైన భూములను ఆక్రమించాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రజా ప్రయోజనాలు లేనపుడు ప్రభుత్వం పేదల భూములు సేకరిం చడం చట్టవిరుద్ధమన్నారు. షాబాద్ మండలంలోని రేగడి దొస్వాడ, మక్తగూడెం, తాళ్లపల్లి, తిమ్మారెడండిగూడెం గ్రామాల కు చెందిన ఎస్సీల అసైన్డ్ భూములు బలవంతంగా లాక్కోవ డాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈశా ఫౌండేషన్ కోసం భూములు ఇవ్వడానికి పేదల భూములే దొరికాయా అందుకోసం ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాలు కేటాయించవచ్చు కదా అని నిలదీశారు. ధనవంతులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించే ఆశ్రమాల కోసం పేద ఎస్సీల భూములు కావాలా అంటూ నిలదీశారు. రేవంత్ రెడ్డి మేమూ భూస్వాములమేనని చెప్పుకున్నారు,మరి వాళ్ల భూములను ఈశా ఫౌండేషన్ వారికి ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈశా ఫౌండేషన్ వల్ల ఇక్కడి పేదలకు జరిగే లాభం ఏంటని అడిగారు. పేదలకు ఉద్యోగాలిస్తారా,చదువు చెప్తారా హాస్పిటల్ నిర్మిస్తారా అంటూ ధ్వజమెత్తారు.దానివల్ల పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. చేవెళ్ల సాక్షిగా మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో, పేదల అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక, లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమిని లక్కోవాలని చూశారని, ఇపుడు సద్గురు బాబా కోసం రేవంత్ బాబా ఎస్సీల భూములు లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పేదలను పుట్టినప్పటి నుండి కేసీఆర్ కిట్ ఇచ్చి,గురుకులాలు పెట్టి డాక్టర్లను తయారు చేసి, పేదలకు మూడు ఎకరాల భూమి ఇచ్చి,దళిత బంధుతో వ్యాపారస్తులుగా తయారు చేయాలని చూశారన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం పేదల భూములు లాక్కొని నిరాశ్రయులను చేసి,అడ్డా కూలీలుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు. కంపెనీలు పెట్టుకోవడానికి హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూమి అందుబాటులో ఉన్నా,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీల భూమిని లాక్కొని వారి పొట్ట కొట్టాలని చూస్తున్నారన్నారు. కంపెనీల కోసం కేటాయించిన భూములను హిల్ట్ పాలసీ కింద తక్కువ ధరకు అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి, అధికారంలోకి వచ్చాక రేవంత్? రెడ్డి సెక్రటేరియట్ లో పెట్టే ప్రతి సంతకం, పేదలకు వ్యతిరేకంగానే చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములకు పట్టా బుక్ జారీచేసి,పేదలకు భూములపై సర్వ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే షాబాద్ మండలంలోని రేగడిదోస్వాడలో భూమి సేకరణకు ప్రయత్నం చేస్తే, లగచర్ల స్ఫూర్తిగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం, భూమి మార్కెట్ విలువకు 3 రెట్లు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతేకాకుండా భూమికి బదులు భూమే కావాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి పేదలకు న్యాయం జరిగేదాక పోరాడతామన్నారు.

## భారీ వర్షాలతో నీట మునిగిన కారు.. బీమా కంపెనీ పరిహారం చెల్లించాల్సిందే

హైదరాబాద్: ఇన్సూరెన్స్ సంస్థపై నమోదైన కేసులో రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం కీలక తీర్పు వెలువరించింది. భారీ వర్షాల వల్ల టాటా నెక్సాన్ ఈవీ కారు బ్యాటరీ దెబ్బతిన్న ఘటనలో బీమా క్లెయిమ్ తిరస్కరించడం సేవాలోపమేనని, బ్యాటరీ రిప్లేస్‌మెంట్ ఖర్చు రూ.7.07లక్షలతో పాటు ఇతర మొత్తాలు చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశించింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని సీబీఎస్ ఏజెన్సీస్ (పార్టనర్‌షిప్ ఫర్మ్ ఈవీ నెక్సాన్ ఎక్స్‌జెడ్ ప్లస్ డార్క్ ఎడిషన్ ఎలక్ట్రిక్ కారును 2022 ఫిబ్రవరి 10 నుంచి వాడుతోంది. ఈ కారుకు ఏప్రిల్ 2023లో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రైవేట్ కార్ స్టాండ్‌లోన్ ఓన్ డ్యామేజ్ పాలసీ తీసుకు న్నారు. ఇన్సూరెన్స్ మొత్తం రూ.13.84 లక్షలు. ఏప్రిల్ చివరి వారంలో భారీ వర్షాల వల్ల ఇంటి వద్ద పార్కింగ్‌లో ఉన్న కారు నీట మునిగి దెబ్బతినడంతో మే 4, 2023న తేజస్వీ ఆటోమొబైల్స్ అధీకృత సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్లారు. ఏబీఎస్ కంట్రోలర్ రిప్లేస్‌మెంట్‌కు రూ.20వేలు, బ్యాటరీ ప్యాక్‌లో నీరు లోపలికి వెళ్లడంతో మొత్తం బ్యాటరీ మార్చడానికి రూ.7, 07,589.75 ఖర్చవుతుందని ఎస్టిమేషన్ ఇచ్చారు. ఇన్సూరెన్స్ కంపెనీకి క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నా సర్వేయర్ సరిగా అసెస్‌మెంట్ చేయకుండా 'డ్యామేజ్‌లు యాక్సిడెంట్ కారణాలతో సరిపోలడం లేదు' అని జులై 31, 2023న క్లెయిమ్‌ను తిరస్కరించారు. ఫిర్యాది.. ఐఆర్?డీఏ గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించినా లాభం లేకపోయింది. సీబీఎస్ ఏజెన్సీస్ మేనేజింగ్ పార్టనర్ సంతోష్ దయానంద్ 2023 డిసెంబర్ 28న రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్?లో ఫిర్యాదు చేశారు. బ్యాటరీ, ఏబీఎస్, పార్కింగ్ ఛార్జీలు, హైర్ కారు ఖర్చులు, వ్యాపార నష్టం, మానసిక ఇబ్బందిని పరిగణనలోకి తీసుకుని రూ.17లక్షలకు పైగా పరిహారం ఇచ్చేలా ఆదేశించాలని కోరారు. విచారించిన కమిషన్.. బీమా కంపెనీ పాలసీ నిబంధనల్లో వరద నీటితో నష్టానికి మినహాయింపు లేదంటూ సర్వేయర్? సరిగా అసెస్‌మెంట్ చేయకుండా నేరుగా తిరస్కరించడం సేవాలోపమేనని స్పష్టంచేసింది. పార్కింగ్ ఛార్జీలు, అద్దె కారు ఖర్చులు, వ్యాపార నష్టం వంటివి డైరీ ఎంట్రీల మీద మాత్రమే ఆధారపడి ఉండటంతో ఆధారాలు సరిగా లేవని తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. బ్యాటరీ ఖర్చు రూ.7,07,589.75కి 9 శాతం వడ్డీ (కేసు ఫైల్ అయిన రోజు నుంచి తీర్పు అమలు వరకు) చెల్లించడంతో పాటు సర్వీస్? ఛార్జీలు రూ.20వేలు, మానసిక వేదనకు పరిహారంగా రూ.50వేలు, 45 రోజుల్లో చెల్లించాలని బీమా సంస్థను ఆదేశించింది.

## రైతులు లాభం వచ్చే పంటలను పండించాలి

రైతులు లాభం వచ్చే పంటలను పండించాలి ప్రపంచ వ్యాప్తంగా పండే ప్రతీ పంట పండించేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 19వ గ్రాండ్ నర్సరీ మేళాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులు లాభం వచ్చే పంటలను పండించాలని సూచించారు. పచ్చదనాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రంలోని అన్నీ జిల్లా కేంద్రాల్లో నర్సరీ మేళాలు నిర్వహించాలన్నారు. నర్సరీలకు ప్రత్యేక ప్రోత్సాహం ఇచ్చి హైదరాబాద్‌లోనే కాకుండా పట్టణ వాసులందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రపంచ దేశాల్లో ఏ పంట పండినా ఆ పంటను మన రాష్ట్రంలో పండించేందుకు అనువైన వాతావారణం ఉందన్నారు. అకడమియా, ఆర్గానెట్ తదితర అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులకు లాభం వచ్చే పంటలను రైతులు పండించుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇలాంటి నర్సరీలు రైతాంగానికి, పట్టణ వాసులకు ఉపయోగపడాలన్నారు. ప్రతీ ఏటా పెద్ద ఎత్తున గ్రాండ్ నర్సరీ మేళాను నిర్వహించేందుకు ప్రోత్సహించడం, అదేవిధంగా పండ్లు, పూలమొక్కలు, కూరగాయల మొక్కల నర్సరీలను ప్రోత్సాహించేందుకు హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషా వివరిస్తూ నర్సరీమేళాలో భారతదేశంలోని అన్ని పూలమొక్కలను అందుబాటులో ఉన్నాయని ఈనెల 26 వరకు మేళా ఉంటుందన్నారు. అన్ని రకాలు ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఫ్లవరింగ్, ఫ్రూట్స్, ఎక్సాటిక్ ప్లాంట్స్



అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మేళా ఇంచార్జ్ ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటలకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు.

## రూ.2.14 కోట్లు పోగొట్టుకుని గిలగిల

హైదరాబాద్: మహిళ ప్రొఫైల్ ఫొటోతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2.14 కోట్లు కొట్టేశారు. సైబరాబాద్ సైబర్‌క్రై మ్ పోలీసుల కథనం ప్రకారం.. టీఎన్‌జీవో కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (44)కు గతేడాది డిసెంబరులో సామాజిక మాధ్యమాల ద్వారా ఓ మహిళ పరిచయమైంది. రోజూ మాట్లాడుకునే వారు. ఈ క్రమంలో తాను స్టాక్ ట్రేడింగ్ ద్వారా బాగా లాభాలు సంపాదిస్తున్నట్లు ఆ మహిళ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు చెప్పింది. అనంతరం మాయమాటలు చెప్పి, తనతో ఓ యాప్ డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయించింది. గతేడాది డిసెంబరు 12న తొలిసారి రూ.31.5 లక్షలు పెట్టుబడి పెట్టగా.. లాభాలు వచ్చాయి. మరిన్ని పెట్టుబడులు పెడితే లాభాలు ఎక్కువగా వస్తాయని చెప్పగా.. రెండోసారి రూ.42.27 లక్షలు బదిలీ చేశాడు.

డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా, లాభంలో 30 శాతం పన్ను యూఏఈ ప్రభుత్వానికి కట్టాల్సి ఉందని.. మరింత పెట్టుబడులు పెట్టాలని సూచించారు. యాప్‌లో వర్చువల్‌గా కనిపించే లాభాలను నమ్మిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. ఆఫీసులో తోటి ఉద్యోగుల నుంచి రూ.90 లక్షలు రుణం తీసుకుని పంపాడు. కుటుంబసభ్యుల దగ్గర నగదు తీసుకోవడంతో పాటు కొన్ని ఆస్తులు అమ్మి మొత్తంగా 8 దఫాల్లో రూ.2.14 కోట్లు పంపాడు. డబ్బు విత్‌డ్రా కోసం ప్రయత్నించగా, అదనంగా రూ.68 లక్షలు కట్టాలని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాడు. సదరు మహిళ ఫొటోను అంతర్జాలంలో పోస్టు చేసి వెతకగా, ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ప్రొఫైల్ నుంచి సేకరించినట్లు తేలింది. నకిలీ ప్రొఫైల్ సృష్టించి మోసం చేసినట్లు తెలుసుకొని సైబరాబాద్? పోలీసులను ఆశ్రయించాడు.

## డెస్టినేషన్ మీటింగ్ అడ్డలా మారింది

హైదరాబాద్: తెలంగాణలో బీఆరస్, కాంగ్రెస్ కావాలని బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నా యని ఆరోపించారు రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్? రావు. సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అవకతవకలపై విచారణ జరగాల్సిందేనని డిమాండ్? చేశారు. కాంగ్రెస్ నేతలు దావోస్ వెళ్లి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ తీరుపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించి నాలుగు నెలలు పూర్తి, అనుబంధ విభాగాల పనితీరుపై ఆయన సమీక్ష చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర కమిటీ పనితీరుపై రామచందర్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం, రామచందర్ రావు మాట్లాడుతూ.. బీజేపీ అగ్రనేతలతో రెండు ఉమ్మడి జిల్లాలకు




ఒకటి చొప్పున ఐదు భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నాం. జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ లాంటి వారి సభల కోసం బీఎల్ సంతోష్‌కి ప్రతిపాదనలు పంపాం అని అన్నారు.

ఇదే సమయంలో తెలంగాణ రాజకీయాలపై స్పందిస్తూ..'సింగరేణి నైనీ కోల్ టెండర్ల విషయంలో రాష్ట్రం కోరితే సీబీఐ విచారణకు కేంద్రం సిద్ధంగా ఉంది. సీబీఐకి ఇస్తే 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరగాలన్నది బీజేపీ డిమాండ్. దావోస్ వెళ్లిన సీఎం రేవంత్ లాస్ట్ టైం వెళ్లినప్పుడు తెచ్చిన పెట్టుబడులు ఎక్కడ పెట్టారో చూపెట్టాలి. ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలి. దావోస్ వెళ్లి చేస్తున్నారు. మంచు చూడటానికి వెళ్లారా. దావోస్ డెస్టినేషన్ మీటింగ్ అడ్డలా మారింది. పెట్టుబడులు తేవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. రెండు దావోస్ పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి. కాంగ్రెస్, బీఆరస్ వైఫల్యం చెందాయి కాబట్టి ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు' అని చెప్పుకొచ్చారు.

## మేడారంలో హెలికాప్టర్ సేవలు ప్రారంభించిన మంత్రి సీతక్క



మేడారం మహా జాతరకు విచ్చేసే భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెలికాప్టర్ రైడ్‌ను మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి.. భక్తుల కోసం రెండు హెలికాప్టర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి మేడారం వరకు హెలికాప్టర్ రైడ్ కోసం రూ.35,999, మేడారం పరిసరాల్లో విహారానికి రూ.4800 ధర నిర్ణయించారు.

ఉత్తేజిత దినపత్రిక

# గ్రామస్థులు ఆందోళన

**ఎమ్మిగనూరు మండల పరిధిలోని మాచుమాన్ దొడ్డి గ్రామంలో గత వారం రోజులుగా మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు ఫిబ్రవరి 17 మంగళవారం ఈ సమస్యను గ్రామ ప్రజల తరపున వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసులు పోస్ట్ శ్రీనివాసులు , తిరుపతయ్య రంగన్న , భీమన్న బాలకృష్ణ , జయరాముడు , నాగరాజు , నాయుడు , వెంకట్ , లక్ష్మన్న , రామకృష్ణ , కేశన్న , రామయ్య , బుక్క రామకృష్ణ, చిన్న ఈరన్న , టైలర్ ఈరన్న తదితరులు కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక గారికి వివరించారు.ప్రజల సమస్య తెలిసిన వెంటనే స్పందించిన బుట్టా రేణుక , సేవా భావంతో తక్షణ చర్యలు తీసుకోవాలని బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివనీలకంఠ గారికి తెలియజేయడం జరిగింది.. వెంటనే స్పందించిన శ్రీ బుట్టా శివ నీలకంఠ గారి మార్గదర్శకత్వంలో బుట్టా ఫౌండేషన్ వెంటనే స్పందించి ప్రత్యేక మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి గ్రామానికి తాగునీటి సరఫరా ప్రారంభించింది. ఈ వేగవంతమైన చర్యతో గ్రామ ప్రజలు ఉపశమనం పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ప్రజా సమస్యల పట్ల అప్రమత్తతతో స్పందిస్తూ అవసరమైన సహాయం అందించడం నిజమైన ప్రజాసేవకుల లక్షణమని గ్రామస్థులు అభిప్రాయ పడుతూ, బుట్టా రేణుక గారికి, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ గారికి మరియు ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైకాపా హయాంలో ఆగమైన రాయలసీమ సాగు ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు

**కేటాయించడం శుభపరిణామమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే. డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి.**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు ఫిబ్రవరి 17 మంగళవారం అసెంబ్లీ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట గత ప్రభుత్వం సీమలోని ఆర్డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల, హంద్రీనీవా, వేదావతి, గాలేరు నగరి ప్రాజెక్టులను సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమకు నీటి బొట్టు రానీ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో లూటీ చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి భారీగా నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు.

## ఎమ్మిగనూరులో వైసీపీని ఖతం చేసే పనిలో భాగంగా సాక్షి చానల్ దిగజారుడు స్టోరీ ప్రసారం..!

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరులో ఫిబ్రవరి 17 మంగళవారం వైసీపీని ప్రజలు గెలిపించలేదన్న అక్కసుతో, కోపంతో ఇక్కడ ఏదో జరుగుతోంది అన్నట్లుగా అబద్ధపు స్టోరీ ప్రసారాలకు తెర లేపింది బ్లూ మీడియా సాక్షి ఛానల్..! ముందు ఎమ్మిగనూరులో సొంత వైసీసీలో ఉన్న వర్గ పోరును చక్కబెట్టుకునేలా స్టోరీలు ప్రచారం చేసుకుంటే మంచిది. పాపం వైసీపీని నమ్ముకుని వ్యక్తిగతంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోయిన పార్టీ శ్రేణులు ఏ నాయకుడి చెంతకు పోవాలో తెలీక లబోదిబోమంటున్నారు. వైసీపీలో ఏర్పడ్డ వర్గ పోరు వల్ల ఎమ్మిగనూరులో వైసీపీ పని పూర్తిగా అయిపోయినట్లుగానే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఎమ్మిగనూరులో సొంత పార్టీని చక్కపెట్టుకోలేని సాక్షి మీడియా ఎమ్మెల్యే బివి జయనాగేశ్వ రెడ్డి గారి గురించి లేని పోని అసత్యాలను క్రియేట్ చేసి ప్రసారాలు చేయడం హాస్యాస్పదం. ఎమ్మిగనూరు ప్రజలు బివి కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకున్నారు. బివి కుటుంబ సభ్యులుగా టీడీపీ శ్రేణులు అందరూ ఉన్నారు. బివి కుటుంబం ఎమ్మిగనూరు ప్రాంతం, ప్రజల శ్రేయస్సు గురించి నిత్యం శ్రమిస్తూ ఉంటుంది. మీరు ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా వ్యర్థం. ఇలాగే కొనసాగితే ఖచ్చితంగా ప్రజల చేతిలో తీవ్రపరిణామాలను ఎదుర్కోక తప్పదు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారు. ఇంతకన్న ఘోరంగా బుద్ధి చెప్పడం ఖాయం. వీలైతే ఎమ్మిగనూరు డెవలప్ మెంట్ గురించి ప్రసారం చేసుకోండి. ప్రజల సమస్యల తరపున నిలబడండి.. అవి వదిలేసి ఇలా లేని పోని గాసిప్స్ క్రియేట్ చేసి అనవసరంగా వైసీపీ రోడ్డు మీద పడేలాగా చేసుకుంటామంటే మీ ఖర్మ..!

## నష్టపోయిన కుటుంబానికి గ్రామస్తులు 25000 రూ ఆర్థిక సాయం

**దేవనకొండ ఫిబ్రవరి 17 ( ఉత్తేజిత)**



కరివేముల గ్రామంలో గ్యాస్ లీకేజ్ వల్ల ఇల్లు పూర్తిగా దగ్ధమై ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు గ్రామ పెద్దలు టిడిపి మాజీ సర్పంచ్ గిడ్డయ్య గౌడ్ ఆధ్వర్యంలో చందాలు ఎత్తి 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం బాధితులకు అందజేశారు. వారు మాట్లాడుతూ రంగనాయకులు కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునే వారని వీళ్లు పనులకు వెళ్ళిన సమయంలో ఈ విధంగా జరగడం చాలా దురదృష్టకరమని ఆర్థికంగా చాలా నష్టపోయారని ఈ కుటుంబానికి మా వంతు ఒక చిన్న సహాయం మాత్రమే చేశామని రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వన్నూరప్ప, బోయ వన్నూరప్ప, మంగళ వెంకటరాముడు, లక్ష్మన్న, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు వైష్ణవి విద్యార్థులు జేఈఈ మెయిన్స్ లో ఉత్తమ ప్రతిభ






**మెయిన్స్ లో ప్రతిభ చాటిన విద్యార్థులు**

**కర్నూలు ఫిబ్రవరి 17 మంగళవారం:** ఎమ్మిగనూరు

విద్యార్థిని అభినందిస్తున్న వైష్ణవి అకాడమీ యాజమాన్యం : ఫిబ్రవరి 17ఎమ్మిగనూరు పట్టణంలోని కొండవీటి ప్రాంతంలోని వైష్ణవి అకాడమీ( జూనియర్ కళాశాల) విద్యార్థులు జేఈఈ మెయిన్స్ 2026 లో ఉత్తమ ప్రతిభ చాటారు. బుధవారం ప్రత్యేక కార్యక్రమంలో వైష్ణవి అకాడమీ చైర్మన్ జి విష్ణు ప్రభు, వైష్ణవి గ్రూప్ చైర్మన్ జిడి లింగప్ప, కరస్పాండెంట్ సత్య సిరి విద్యార్థులను అభినందించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా విద్యార్థుల కఠోర శ్రమ, అంకితభావం, అధ్యాపకుల ఉత్తమ బోధన, ప్రణాళిక ఈ ఫలితాలు సాధించారని అన్నారు ఈ ఫలితాలు మాపై మరింత బాధ్యత పెంచాయని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడానికి కృషి చేస్తామన్నారు. తమ కళాశాల విద్యార్థి కే తరుణ్ 97.91తో జిల్లాలో టాపర్ ఒకరిగా, ఆదోని డివిజన్ లో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే మా విద్యార్థులు బి కృష్ణ చైతన్య 93.56, కే లక్ష్మీకాంత్ 91.92, ఎస్ కొంగతి మమత 86.83, ఎం సాయి యువరాజ్ 84.31 సాధించారు టాపర్ గా నిలిచిన కే తరుణ్ ప్రత్యేకంగా ఇంటి వద్ద కళాశాల యాజమాన్యం అధ్యాపక బృందం విద్యార్థిని పుష్పగుచ్ఛంతో అభినందించి, స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేసుకున్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన సి.బెళగల్ గురుకుల పాఠశాల విద్యార్థులు

**ఉత్తేజిత న్యూస్ ఫిబ్రవరి 17 సి.బెళగల్**



మండల పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థులు గత నెల జనవరి నెలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో ఎం సంజీవరాజు 74% మార్కులు సాధించి అర్హత సాధించగా, బి చార్లెస్ 60 శాతం మార్కులతో భరత సాధించారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ చింతలయ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ చింతలయ్య మాట్లాడుతూ ఎటువంటి కోచింగ్ లేకుండా జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని ఉపాధ్యాయులపై సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఈనెల 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం.

**నూతన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ కార్యవర్గం ఎన్నిక. టి. శివారెడ్డి, కర్నూలు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి.**

**కర్నూలు ఫిబ్రవరి 17**

:-ఈనెల 19వ తేదీ గురువారం రోజున రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం మరియు జిల్లా కేంద్రం లో నూతన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ కార్యవర్గం ఎన్నిక నిర్వహించబడునని కర్నూలు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి. శివారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.మంగళవారం సి క్యాంపులోని కర్నూలు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శివరెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలోని జిల్లా కోర్టుకు ఎదురుగా ఉన్న "యునైటెడ్ క్లబ్" ఆవరణములో రాష్ట్రస్థాయి పెన్షనర్ అసోసియేషన్ వారి ఆదేశానుసారముగా కర్నూలు నగరంలో ఈనెల 19వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించి, అనంతరం కర్నూలు జిల్లా కేంద్రంలో నూతన కార్యవర్గమును ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కావున జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులను కోరినారు.జారీ చేయువారు:- కర్నూలు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయము.

## వన్యప్రాణులను కాపాడుకుందాం !

ఇటీవల పెద్దపులుల జనావాసాల్లోకి వచ్చి హడలెత్తించాయి. అడపాదడపా చిరుతలు వస్తూనే ఉన్నాయి. అక్కడక్కడా ఎలుగుబంట్లు దాడి చేస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అడవిపందులు, జింకలు పంటలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు కూడా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇకపోతే కోతుల దాడికి హద్దే లేకుండా పోయింది. ఇలా ఇవన్నీ జనావాసాల్లో ఎందుకు వస్తున్నాయో జనాలు ఆలోచించడంలేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ ఇలా జనావాసాల మీద పడడానికి కారణం మనమే. అడవులను, కొండలను ధ్వంసం చేసిన పాపానికి భయాన్ని అనుభవిస్తున్నాం. ఇప్పటికీ ఈ విధ్వంసం ఆగడం లేదు. ఆపాలన్న ఆలోచన రావడం లేదు. మనమే ప్రకృతిని ఇలా విధ్వంసం చేస్తూ పోతే ఇకముందు తరాలు ఇంతకు మించి దారుణాలు ఎదుర్కోక తప్పదు. వానరాలు ఊళ్లమీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన గడప వరకూ వచ్చేస్తున్నాయి. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం? మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల క్షీణతకు దారితీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత లోపిస్తోంది.

వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా అధికారులకు తెలియజేసే ప్రయత్నాలు రావాలి. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం?అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి. అడవులను నరికివేయడం,ఖనిజాల వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల జరుగుతున్న దుష్పరిణామం ఇది. సహజవనరులను దోచుకోవడానికి అటవీ భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ ఫలితం అని గుర్తించాలి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అ వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అటవీప్రాంతం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి.

## వసతి గృహాన్ని తనిఖీ చేసిన సంక్షేమ అధికారి







**ఉత్తేజిత న్యూస్ ఫిబ్రవరి 17 సి.బెళగల్**

మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల ప్రభుత్వ వసతి గృహాన్ని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి ఎం శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షల గురించి పలు సూచనలు చేశారు.అనంతరం అతడు మాట్లాడుతూ పదో తరగతిలో 100% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని, అందుకు తగినట్లుగా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని హాస్టల్ వార్డెన్ రమేష్ కు సూచించారు. ప్రభుత్వం సర్వే చేసిన ఐవిఆర్ఎస్ కాల్స్ పై 80 శాతం మంచి అభిప్రాయం తెలిపారని తెలియజేశారు.

# మీ స్టామినా పెంచి, ఆరోగ్యంగా ఉంచే ఫుడ్స్ ఇవే..!



కొందరికి కొంచెం దూరం నడవగానే, పరిగెత్తగానే ఆయాసం వస్తూ ఉంటుంది, వెంటనే ఓ చోట కూర్చుండి పోతారు. ఇంకొందరికి చిన్నపని చేసినా అలసటగా అనిపిస్తుంది, ఎక్కువసేపు ఏ పనీ చేయలేరు. ఈ సమస్యలు అన్నీ స్టామినా లేకపోవడం వల్ల వస్తాయని నిపుణులు అంటున్నారు. మనం ఏపని చేయడానికైనా స్టామినా అవసరం. శారీరకంగా, మానసికంగా యాక్టివ్‌గా ఫిట్‌గా ఉండటానికి స్టామినా చాలా అవసరం. మంచి స్టామినా బరువు తగ్గడానికి సహాయపడతాయి. స్టామినా ఎక్కువగా ఉంటే.. ఫిజికల్ యాక్టివిటీస్ ఎక్కువసేపు చేయగలం, దీంతో క్యాలరీలు ఎక్కువగా బర్న్ అవుతాయి. స్టామినా పెరగడానికి పోషకా హారం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మీ డైట్ రకరాల పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న సమతుల్య ఆహారం చేర్చుకోండి. మీ స్టామినా పెంచడానికి సహాయపడే ఆహార పదార్థాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

అరటిపండ్లు.. అరటిపండ్లలో కార్బోహైడ్రేట్లు, న్యాచురల్ షుగర్స్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు మీ శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అన్ని సీజన్లలో సులభంగా దొరికే.. అరటిపండ్లు మీ స్టామినా పెంచడానికి, మీరు యాక్టివ్‌గా పనిచేయడానికి సహాయపడతాయి. మీ బ్రేక్‌ఫాస్ట్‌లో స్మూతీలా తీసుకోవచ్చు, సాయంత్రం పూట స్నాక్‌గా తీస్నుకోవచ్చు.

ఓట్స్ ఓట్స్‌లో ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, విటమిన్ బి- కాంప్లెక్స్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఆహారాన్ని శక్తిగా మార్చడానికి తోడ్పడతాయి. ఓట్స్‌లోని పోషకాలు.. శక్తిని నెమ్మదిగా, స్థిరంగా విడుదల చేస్తాయి. ఓట్స్, బరువు తగ్గడానికి కూడా సహాయపడతాయి. మీ బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్ తీసుకుంటే స్టామినా పెంచుకోవచ్చు. ?

క్వినోవా.. క్వినోవాలో ప్రొటీన్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మెగ్నీషియం, ఐరన్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తాయి, ఓర్పును మెరుగుపరచడానికి సహాయపడతాయి. మీ డైట్ తరచు ఇది చేర్చుకుంటే.. స్టామినా మెరుగుపరచుకోవచ్చు.

చియా సీడ్స్..చియా సీడ్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. చియా సీడ్స్ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి, వాపను తగ్గిస్తాయి. పెరుగు, వోట్మీల్, స్మూతీస్‌పైన చియా సీడ్స్ చల్లుకోండి. బాదంలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తాయి, స్టామినా పెంచుతాయి. రోజూ ఉదయం పూట.. నానబెట్టిన బాదంపప్పులు తినండి. పాలకూరలో ఐరన్, మెగ్నీషియం, అవసరమైన విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది, ఆక్సిజన్ రవాణాను మెరుగుపరుస్తుంది, శక్తి స్థాయిలను పెంచుతుంది. మీ సలాడ్‌లు, శాండ్‌విచ్‌లు, స్టైర్-ఫ్రైస్ లేదా స్మూతీస్‌లో పాలకూరను యాడ్ చేసుకోండి. బీట్‌రూట్‌లో నైట్రేట్‌లు ఎక్కువగా ఉంటాయి, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. వ్యాయామ పనితీరు, శక్తిని పెంచుతుంది. మీ స్టామినా పెంచుకోవడానికి, రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగండి.

కమల.. కమల పండులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, న్యాచరల్ షుగర్స్ ఉంటాయి. ఇవి శక్తి స్థాయిలను మెరుగుపరుస్తాయి, అలసటను దూరం చేస్తాయి. శక్తిని పెంచుతాయి.

లీన్ ప్రొటీన్ మాంసాలు, గుడ్లు, చేపలు, టోఫూ వంటి ఆహారాలలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది కండరాలను మరమ్మత్తు చేస్తే, శక్తిని ఉత్పత్తి చేస్తే అమైనో యాసిడ్లను అందిస్తుంది. శక్తిని మెరుగుపరచ౯డానికి, అథ్లెటిక్ పనితీరుకు మద్దతు ఇవ్వడానికి మీ భోజనంలో లీన్ ప్రొటీన్లను చేర్చుకోండి.

గ్రీన్ టీ.. గ్రీన్ టీలో కెఫిన్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీవక్రియను పెంచుతాయి, శక్తిని అందిస్తాయి, ఓర్పును పెంచుతాయి. దాని ప్రయోజనాలను ఆస్వాదించడానికి మీ రెగ్యులర్ టీ బదులుగా గ్రీన్ టీ తాగండి.



# మగవారికి బట్టతల ఎందుకు వస్తుందో తెలుసా..

చాలామంది మగవారిని ఇబ్బందిపెట్టే సమస్యల్లో బట్టతల ఒకటి. నలభై ఏళ్లు దాటిన తర్వాత, ఇలా జుట్టు రాలితే పెద్దగా పట్టించుకోరు. కానీ ఈ రోజుల్లో చిన్నవయస్సులోనే బట్టతల వచ్చేస్తోంది. చిన్నవయస్సులోనో బట్టతల వచ్చియ. వయస్సు మీదపడిన వారిలా కనిపిస్తుంటారు. దీని కారణంగా నలుగురిలో తిరగడానికి సిగ్గుపడుతుంటారు, ఆత్మన్యూనతకు గురవుతుంటారు. జన్యుపం౯మైన, హార్మోన్ కారణాల వల్ల పురుషులలో బట్టతల వచ్చే అవకాశం ఉంది. బట్టతల రావడానికి పురుష హార్మోన్ అయిన టెస్టోస్టిరాన్ జన్యు పరమైన కారణాలతో తలపై చర్మంలో డీ హైడ్రో టెస్టోస్టిరాన్‌గా మారిపోవడంతో వేగంగా వెంట్రుకలు ఊడిపోతాయి. యుక్త వయస్సులో టెస్టోస్టిరాన్ పెరుగుతున్న దశ నుంచే వెంట్రుకలు రాలిపోవడం మొదలవుతాయి. జన్యుపరమైన కారణాలు బట్టతల రావడానికి ప్రధాన కారణమైనప్పటికీ.. మగవారిలో బట్టతల రావడానికి చాలా కారణాలు ఉన్నాయి. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

కొన్ని రకాల మందులు వాడితే..కొన్ని రకాల మందులు బట్టతలకు కారణం అవుతాయి. క్యాన్సర్, అధిక రక్తపోటు, డిప్రెషన్, ఆర్థరైటిస్ ట్రీట్మెంట్‌కు వాడే మందులు.. జుట్టు రాలడానికి కారణమవుతాయి. మీరు ఏదైనా మందులు వాడే ముందు.. జుట్టు రాలే ప్రమాదం గురించి వైద్యులతో మాట్లాడండి. కొన్ని సందర్భాల్లో, ప్రత్యామ్నాయ మందులు అందుబాటులో ఉండవచ్చు.

హార్మోన్ల అసమతుల్యత.. ముందుగా చెప్పినట్లుగా హార్మోన్ల అసమతుల్యత, ముఖ్యంగా అధిక పురుషుల బట్టతలకి దోహదం చేస్తుంది. థైరాయిడ్ రుగ్మతలు, హార్మోన్ల చికిత్సల వంటి వైద్య పరిస్థితుల కారణంగా బట్టతల వచ్చే అవకాశం ఉంది. అంతర్లీనంగా ఉన్న హార్మోన్ల సమస్యకు చికిత్స చేయడం వల్ల జుట్టు రాలడాన్ని నివారించవచ్చు లేదా రివర్స్ చేయవచ్చు.

వయస్సు.. పురుషులలో వయస్సు పెరిగే కొద్దీ.. టెస్టోస్టెరాన్ స్థాయిలు క్రమంగా తగ్గుతూ ఉంటాయి. దీని కారణంగా జుట్టు రాలే అవకాశం ఉంది. దీన్ని నివారించలేనప్పటికీ.. ముందే మీ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తే.. హెయిర్ ఫాల్ సమస్యను నివారించవచ్చు. ప్రత్యేకంగా రూపొందించిన జుట్టు సంరక్షణ ఉత్పత్తులను ఉపయోగిస్తే.. మీ జుట్టు రాలకుండా నివారించవచ్చు. పోషకాహార లోపం..

పోషకహారలోపం కారణంగా.. జుట్టు రాలే అవకాశం ఉంది. విటమిన్లు ఎ, సి, డి, ఇ, బయోటిన్, ఐరన్ సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకుంటే.. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది, బట్టతల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

ఒత్తిడి.. దీర్ఘకాలిక ఒత్తిడి సాధారణ హెయిర్ గ్రోథ్ సైకిల్‌కు అంతరాయం కలిగిస్తుంది, ఫలితంగా హెయిర్ ఫాల్ సమస్య ఎక్కువవుతుంది. దీర్ఘశ్వాస వ్యాయామాలు, మ్యూజిక్ వినడం వంటివి మీ ఒత్తిడిని తగ్గిస్తాయి.





వైద్య పరిస్థితులు.. స్కాల్ప్ ఇన్ఫెక్షన్లు, కీమోథెరపీ వంటి కొన్ని వైద్య పరిస్థితులు జుట్టు రాలడానికి కారణమవుతాయి. ఈ కేసులను నిర్వహించడంలో అంతర్లీన స్థితికి చికిత్స చేయడం, వైద్య సలహా తీసుకోవడం చాలా కీలకం.

హెయిర్‌స్టైలింగ్స్ ఎక్కువగా చేసుకుంటే బట్టతల వచ్చే అవకాశం ఉంది. హాట్ స్టైలింగ్ టూల్స్, కఠినమైన కెమికల్స్ ఎక్కువగా ఉపయోగిస్తే.. వెంట్రుకల కుదుళ్లు దెబ్బతింటాయి, ఇది హెయిర్ ఫాల్‌కు కారణం అవుతుంది.స్మోకింగ్.. స్మోకింగ్ రక్తప్రసరణ, హెయిర్ ఫోలికల్స్‌పై హానికరమైన ప్రభావాలను కలిగిస్తుంది, హెయిర్ ఫాల్‌కు కారణం అవుతుంది. స్మోకింగ్ మానేస్తే మీ ఆరోగ్యానికి మంచి జరగుతుంది, బట్టతల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



# ఇలా క్లీన్ చేస్తే నగలు మెరిసిపోతాయి



బంగారం అంటే చాలా మందికి ఇష్టమే. వీటిని పార్టీలు, ఫంక్షన్లు, పండుగల సమయంలో ఎక్కువగా వేసుకుంటారు. అయితే, కొత్తగా కొన్నప్పుడు ఉన్నంత మెరుపు వాడే కొద్దీ ఉండదు. అలాంటప్పుడు వాటిని క్లీన్ చేయాలి. అందుకోసం కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. అవేంటో చూద్దాం. బంగారు ఆభరణాలను క్లీన్ చేసేందుకు శుభ్రమైన నీటి గిన్నెలో కొద్ది సోప్ వాటర్ వేయండి. అందులో బంగారు నగలను 15 నిమిషాల పాటు నానబెట్టాలి. తర్వాత టూత్ బ్రష్, సాఫ్ట్ బ్రష్‌తో రుద్దండి. తర్వాత కాటన్ క్లాత్‌తో నగలను తుడవండి. మీ బంగారు ఆభరణాలు కొత్తగా మెరుస్తాయి. మీ బంగారు ఆభరణాలు మెరవడానికి స్నానం చేస్తున్నప్పుడు, రెండు వారాలకి ఓ సారి ఇలా చేయండి.







వజ్రాలు, కెంపులు, పచ్చలు మొదలైన బంగారు ఆభరణాలను శుభ్రం చేయడానికి సబ్బు, నీటిని వాడొచ్చు. బంగారు ఆభరణాల్లోని మురికిని తగ్గిస్తుంది. ముత్యాలు మృదువైన పదార్థాలతో తయారు చేస్తారు. కాబట్టి, తేలికపాటి షాంపూతో క్లీన్ చేయండి. దీంతో క్లీన్ చేయడం మంచిది. దాని రంగు కూడా మారదు. కొద్దిగా టూత్ పేస్టు తీసుకుని బ్రష్‌పై పెట్టి నీరు కలిపి నగలపై రుద్దండి.

దీంతో దుమ్ము, ధూళి పోతుంది. మళ్ళీ నగల నుండి మురికిని క్లీన్ చేసేందుకు శుభ్రమైన నీటిలో ముంచిన మృదువైన వస్త్రాన్ని ఉపయోగించండి. టూత్‌పేస్టుతో మురికిని తగ్గిస్తాయి. బంగారు ఆభరణాలు గిన్నెలో ఉంచండి. అవి మునిగేవరకూ గోరువెచ్చని నీరు పోసి. దీని వల్ల ఆర్నమెంట్స్ నుంచి మురికి, జిడ్డు తగ్గుతుంది. ఆభరణాలను వేడి నీటిలో ఉంచి మెత్తని బ్రష్, కాటన్ క్లాత్‌తో క్లీన్ చేయాలి. నగలు ఇంకా జిడ్డుగా ఉంటే మెరుస్తాయి. వీటిని మరువొద్దు.. బంగారు ఆభరణాలను క్లీన్ చేసేటప్పుడు గట్టిగా స్క్రబ్ చేయొద్దు. మెల్లిగా చేయాలి. స్టోన్స్ ఉంటే వాటిని మరీ మెల్లిగా చేయాలి. రాళ్ళతో తయారైన వాటిని ప్రొఫెషనల్స్‌తోనే క్లీన్ చేయాలి. దీనివల్ల మెరుపు వస్తుంది. వీటిని ఎలా పడితే అలా కాకుండా వాటి కోసం కేటాయించిన కంటెయినర్‌లోనే పెట్టాలి.

# మగవారు ఫ్యాషన్‌గా...

డ్రెస్సింగ్‌ని బట్టి మనం ఫ్యాషన్‌గా కనిపిస్తుంటాం. కొంతమందికి ఫ్యాషన్‌గా కనిపించాలని ఉంటుంది. కానీ, ఏ టిప్స్ పాటించాలో తెలియదు. అలాంటి వారు కొన్ని టిప్స్ పాటించాలి. వాటి వల్ల చూడ్డానికి ఫ్యాషన్‌గా కనిపించడమే కాదు. కాన్ఫిడెంట్‌గా కూడా ఫీల్ అవుతారు. అందుకోసమే మగవారు ఫాలో అవ్వాల్సిన ఫ్యాషన్ హ్యాక్స్ గురించి తెలుసుకుందాం. అయితే, ఈ మధ్యకాలంలో జీన్స్ లూజ్‌గా వేసుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. కానీ, ఇది ఆడవారికి



బావుంటుంది. కానీ, మగవారికి అంతగా సెట్ అవ్వదు. కాబట్టి, మీకు పర్ఫెక్ట్‌గా కుదిరే జీన్స్ వేసుకోండి. దీని వల్ల చూడ్డానికి చక్కగా కనిపిస్తారు. చాలా మంది టీ షర్ట్ వేసుకుంటారు. వాటి మీదకి కచ్చితంగా మ్యాచింగ్ జీన్స్‌తో పేర్ చేయాలని గుర్తుపెట్టుకోండి. అప్పుడే ఆ డ్రెస్‌కి పర్ఫెక్ట్ లుక్ వస్తుంది. అంతేకానీ, అప్పర్ వేర్, లోయర్ వేర్ డిఫరెంట్‌గా ఉంటే చూడ్డానికి అస్సలు బాగోదు. ఏదైనా ఫ్యాషన్ వస్తే అంతా దానినే ఫాలో అవుతుంటారు. కానీ, అలా ఎప్పుడు చేయొద్దు. మీరు కూడా కొన్నింటిని ట్రై చేయండి. కొత్తకొత్తవి ట్రై చేయడంలో తప్పు లేదు. అయితే, అవి మనం వేసుకోవడానికి బావుంటాయా లేదా సూట్ అవుతాయా లేదా అని ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. ఎందుకంటే అందరికీ అన్ని సూట్ అవ్వవని గుర్తుంచుకోవాలి.

అదే విధంగా, మనం వెళ్ళే అకేషన్‌ని బట్టి డ్రెస్సింగ్ ఉండాలి. అన్నింటికీ ఒకే డ్రెస్సెస్‌ని వేసుకోవడం చేస్తుంటారు. అలా ఎప్పుడు కూడా వేసుకోవద్దు. గుడికి వెళ్లేటప్పుడు ట్రెడిషనల్, సినిమాకి వెళ్ళినప్పుడు ట్రెండీగా ఇలా అకేషన్‌ని బట్టి మీ డ్రెస్సింగ్ ఉండాలని గుర్తుపెట్టుకోండి.

# నాజుకుగా అవుతారు, సులభం కూడా..!



ప్రస్తుతం ఎంతోమంది ఎదుర్కొంటున్న సమస్య.. అధికబరువు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 2 వందల కోట్ల మంది మధ్య వయస్కులు ఈ సమస్యతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అధిక బరువు కారణంగా శారీరక సమస్యలే కాదు.. మానసిక సమస్యలూ ఎదురవుతాయి. పెరిగిన బరువు తగ్గడానికి ఏవేవో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. మీరు ఈ కోవకు చెందినవారైతే.. 30-30-30 రూల్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. 30-30-30 రూల్ సులభంగా, ఆచరణాత్మకంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఇది మన లైఫ్‌స్టైల్, ఆహార అలవాట్లలో అర్థవంతమైన మార్పులు చేయడానికి తోడ్పడుతుంది. రోజువారీ కేలరీల తీసుకోవడం, శారీరక శ్రమ, తెలివిగా ఆహారాన్ని తీసుకోవడం వంటి నిర్మాణాత్మక విధానాన్ని 30-30-30 రూల్ ప్రోత్సహిస్తుంది. అసలు 30-30-30 రూల్ అంటే ఏమిటి, ఎలా పాటించాలో ఈ స్టోరీలో చూద్దాం.

ఈ 30-30-30 రూల్‌లో మొదటి రూల్ క్యాలరీ కంట్రోల్‌పై దృష్టి పెట్టడం. ఈ రూల్ ప్రకారం మీ రోజువారీ క్యాలరీల ఇన్‌టేక్‌ను సుమారు 30% తగ్గించాల్సి ఉంటుంది. ఇది కష్టమేమి కాదు, ఇది రోజూ పాటిస్తే.. అలవాటుగా మారుతుంది. మీరు క్యాలరీ ఇన్‌టేక్ తగ్గించడానికి.. క్యాలరీల అవసరాలను కౌంట్ చేయండి. దీనికోసం దృష్టి పెట్టాలి. ఉదాహరణకు, మీ %ుణజుజు% రోజుకు 2,000 కేలరీలు ఉంటే, మీరు దాదాపు 1,400 కేలరీలు తినాలని టార్గెట్ పెట్టుకోండి. మీ డైట్‌లో సమతుల్య ఆహారం తీసుకోవాలి, పోషకాలు సమృద్ధిగా ఉండాలి. రోజూ సరిపడా నీళ్లు తాగాలి.



30 నిమిషాలు వ్యాయామం చేయండి.. ఈ 30-30-30 రూల్‌లో రెండో రూల్.. 30 నిమిషాల వ్యాయామం. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే.. బరువు తగ్గడమే కాదు, మీ ఆరోగ్యానికీ మేలు జరుగుతుంది. వ్యాయామం మీ జీవక్రియను మెరుగుపరుస్తుంది, తద్వారా శరీరంలోని కొవ్వును కరిగిస్తుంది. ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని టార్గెట్ పెట్టుకోండి. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి ఎక్సర్‌సైజ్‌లు చేయవచ్చు. మీరు కావాలనుకుంటే.. మీ వర్కఅవుట్ టైమ్‌ను పెంచుకోవచ్చు. ఏరోబిక్ వ్యాయామాలు.. మీ రొటీన్‌లో చేర్చుకుంటే కొవ్వు త్వరగా కరుగుతుంది. ఈ రోజుల్లో చాలామంది భోజనం చేసేప్పుడు ఫోన్, టీవీ లాంటివి చూస్తూ ఉంటారు. తినే ఆహారంపై ధ్యాస పెట్టరు. మీ భోజనాన్ని ఆస్వాదించడానికి కనీసం 30 నిమిషాలు కేటాయించండి. ప్రతి ముద్దను, బైట్‌ను ఆస్వాదించండి. మైండ్‌ఫుల్‌గా తినడం వల్ల కడుపు త్వరగా నిండిన ఫీలింగ్ వస్తుంది, అతిగా తినడాన్ని నిరోధిస్తుంది. మీ ఆహారాన్ని నెమ్మదిగా నమలండి, దీంతో జీర్ణక్రియపై పనిబారం తగ్గుతుంది, శరీరం పోషకాలను బాగా గ్రహిస్తుంది. మీ ఆహారాన్ని ఎంజాయ్ చేస్తూ, బుద్ధి పూర్వకం గా తింటే.. బరువు తగ్గడమే కాదు, మీ ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల్య ఆహారం, మైండ్‌ఫుల్ ఈటింగ్ దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును కూడా తగ్గిస్తాయి.



# మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లే..

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం. ఇందులో భాగంగానే మానసిక సమస్యలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తారు. ముఖ్యంగా పిల్లలు ఈ సమస్యలతో సతమతమవ్వకుండా తల్లిదండ్రులు, టీచర్స్ కీ రోల్ పోషిస్తారు. పూర్తి వివరాలు ఏంటో తెలుసుకోండి. అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసికంగా ఆరోగ్యంగా చేయడానికి ఈ రోజు కీ రోల్ పోషిస్తుంది. మంచి జీవితాన్ని అనుభవించాలంటే మానసిక, శారీరక ఆరోగ్యం చాలా అవసరం. ఈ రోజు లక్ష్యం ఏంటి.. చుట్టు పక్కల ఉన్నవారు వారి ఆలోచనలు బహిరంగంగా పంచుకోవడానికి, సపోర్ట్ ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఒకరికి ఒకరు సపోర్ట్ చేయాలి. పేదరికం, హింసకు గురవ్వడం, శారీరక, మానసిక మార్పుల కారణంగా పిల్లల్లో ముఖ్యంగా 10 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న ఆరుగురిలో ఒకరికి మానసిక సమస్యలొస్తాయి. అందుకే టీనేజ్‌లో ఉన్న వారి సమస్యల్ని గుర్తించి వాటిని పరిష్కరించడం వల్ల ఫ్యూచర్ బెటర్‌గా ఉంటుంది.ప్రపంచ వ్యాప్తంగా 10 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న ఏడుగురిలో ఒకరు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. అయితే, వీటికి రెగ్యులర్‌గా ట్రీట్‌మెంట్స్ ఉండవు.

టీనేజ్‌లో సమస్యలు.. టీనేజ్‌లో ఉన్నవారికి మానసిక సమస్యలు రావడం సాధారణం. పెద్దవారిలో కంటే యువకుల్లో ఆందోళన సమస్యలు ఎక్కువగా ఉంటాయి. 10 నుంచి 14 సంవత్సరాల వయస్సులో 3.6 శాతం మందికి ఆందోళన, 1.1 శాతం మందికి డిప్రెషన, 15 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారికి 4. 6 శాతం మందికి ఆందోళన, 2.8 శాతం మందికి డిప్రెషన్ వంటి సమస్యలతో ఉన్నారని చెబుతున్నారు. ఇది వారి చదువుపై ఎఫెక్ట్ పడే ప్రమాదం ఉంది. దీని వల్ల ఒంటరితనం పెరిగి డిప్రెషన్ ఆత్మహత్యలకి కారణమవుతుంది. టీనేజ్‌లోని పిల్లలకి వారి ప్రవర్తనలో మార్పులు సహజం. వారికి అటెన్షన్ డెఫిసిట్, హైపర్ యాక్టివ్ డిజార్డర్, ఏకాగ్రత లేకపోవడం, హైపర్ యాక్టివ్ వంటి సమస్యలతో పాటు సంబంధం లేకుండా ప్రవర్తించొచ్చు. 10 నుంచి 14 సంవత్సరాల వయసు ఉన్నవారికి 3. 1శాతం, 15 నుంచి 19 సంవత్సరాల వయసులో 2.46 శాతం మందికి ప్రవర్తనా సమస్యలు ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ఇవే కాకుండా, అనోరెక్సియా, ఆత్మహత్య ఆలోచనలు వంటి సమస్యలతో పాటు శరీర బరువు పెరగడం వంటి సమస్యలు తగ్గేందుకు ఏం చేయాలో చూద్దాం. పిల్లలు తమ ఫ్యూచర్ లైఫ్ ఎలా ఉండాలనే టెన్షన్‌లో ఉంటారు. ఇలాంటప్పుడు మానసికంగా దృఢంగా ఉండాలి. అదే విధంగా మీరు కావాలనుకుంటే ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోవాలి.

# పీఎఫ్ ఖాతాదారులకు అలర్ట్..




ప్రావిడెంట్ ఫండ్ నుంచి మీరు డబ్బులు తీసుకోవాలనుకుంటున్నారా? అయితే, వెంటనే తీసుకోండి. తాజాగా ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కరోనా సమయంలో తీసుకొచ్చిన విత్ డ్రా ఫెసిలిటీని ఆపేస్తున్నట్లు ఓ నివేదిక తెలిపింది. ఆ వివరాలు తెలుసుకుందాం.

పీఎఫ్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఎకనామిక్ టైమ్స్ పేర్కొంది. కోవిడ్ మహమ్మారి విజృంభించిన క్రమంలో కోవిడ్ అడ్వాన్సెస్ పేరుతో తమ రిటైర్మెంట్ ఫండ్ నుంచి కొంత తీసుకునేందుకు తెచ్చిన విత్ డ్రా ఫెసిలిటిని నిలిపివేసినట్లు పేర్కొంది. అయితే, ఈ విషయంపై ఈపీఎఫ్ఓ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే, ఎవరైనా పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవాలని భావిస్తే వెంటనే తీసుకోవడం మంచిది. ఈ విషయంపై ఈపీఎఫ్ఓ అధికారిక ప్రకటన వచ్చినట్లయితే ఆ తర్వాత తీసుకోవడం కుదరదు. 2020 ఏడాదిలో కరోనా వైరస్ మన దేశంలో విజృంభించింది. దీంతో లాక్‌డౌన్ పెట్టాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఈ క్రమంలో పీఎఫ్ ఖాతాదారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈపీఎఫ్ తమ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ నుంచి రెండు సార్లు డబ్బులు తీసుకునేందుకు కోవిడ్ విత్ డ్రా ఫెసిలిటీ తీసుకొచ్చింది. ఈ మేరకు 2020, మార్చిలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన లో భాగంగా ఈ ఫెసిలిటీ తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ.. ఎంప్లాయిమెంట్ ఇన్ ఎప్లాయింస్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్ 1952 లో కీలక మార్పులు చేసింది. ప్యారాగ్రాఫ్ 68ఎల్ లోని సబ్ ప్యారా 3 లో సవరణలు చేసి అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం.. మూడు నెలల పాటు ప్రాథమిక వేతనాలు, డియర్ నెస్ అలవెన్స్‌ల మేరకు లేదా ఈపీఎఫ్ ఖాతాల సభ్యుని క్రెడిట్ లో ఉన్న మొత్తంలో 75 శాతం వరకు ఏది తక్కువైతే అది తీసుకునేందుకు అవకాశం కల్పించారు.

అక్టోబర్‌లో 15. 29 లక్షల కొత్త ఖాతాలు.. ఈ ఏడాది అక్టోబర్ నెలలో కొత్తగా 15. 29 లక్షల పీఎఫ్ ఖాతాలు తెరిచినట్లు ఈపీఎఫ్ఓ తెలిపింది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 18. 22 శాతం అధికమని పేర్కొంది. ఈ మేరకు డిసెంబర్ 20వ తేదీన పేరోల్ డేటా విడుదల చేసింది. అలాగే అక్టోబర్, 2023 లో మొత్తం 7. 72 లక్షల మంది కొత్త సభ్యులు ఈపీఎఫ్ఓకు చెందిన సోషల్ సెక్యూరిటీ స్కీమ్ కిందకు వచ్చినట్లు పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఇది 6. 07 శాతం అధికమని పేర్కొంది.

# నోటీసులు పంపిస్తున్న ఐటీ శాఖ..



ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు బిగ్ అలర్ట్. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్‌కు సంబంధించి పలువురు ట్యాక్స్ పేయర్స్‌కి అడ్వైజరీలు పంపిస్తోంది. ఐటీఆర్ ఫైలింగ్‌లో వివరాలు సరిపోలకుండా అన్న వారికి ఈ అడ్వైజరీలు వస్తున్నట్లు ఐటీ శాఖ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. మరి మీకూ వచ్చాయేమో తెలుసుకోండి.

పన్ను చెల్లింపుదారులకు అలర్ట్. ఆదాయపు పన్ను శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ ఫైలింగ్ చేసినప్పుడు తెలిపిన వివరాలకు సంబంధించి పలువురు ట్యాక్స్ పేయర్స్‌కు అడ్వైజరీ పంపిస్తున్నట్లు తెలిపింది. ఐటీఆర్‌లో పేర్కొన్న వివరాలు, రిపోర్టింగ్ ఎంటిటీల నుంచి వచ్చిన వివరాలు సరిపోలకపోయినట్లయితే వారికి ఈ అడ్వైజరీ పంపిస్తున్నట్లు తెలిపింది. రిపోర్టింగ్ ఎంటిటీల్లో బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు, స్టాక్ మార్కెట్ ప్లేయర్స్, మ్యూచువల్ ఫండ్లు, ప్రాపర్టీ రిజిస్ట్రార్స్ వంటివి ఉన్నాయి.

'ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేసిన తర్వాత వాటిని సెంట్రల్ ప్రాసింగ్ సెంటర్ ప్రాసెసింగ్ చేస్తుంది. అందులో ఏదైనా తప్పులు లేదా వడ్డీ రేట్లు, హౌస్ ప్రాపర్టీ ఆదాయం, టీడీఎస్ క్రెడిట్ క్లెయిమ్‌లో తేడాలు వంటివి గుర్తించినప్పుడు ఆయా ట్యాక్స్ పేయర్స్‌కు ఈ అడ్వైజరీ పంపిస్తున్నాం. ట్యాక్స్ పేయర్స్‌కు పంపిస్తున్నది నోటీసులు మాత్రం కాదు. ఐటీఆర్‌లో పేర్కొన్న వివరాలు, రిపోర్టింగ్ ఎంటిటీల ద్వారా వచ్చిన సమాచారంలో తేడాలు గమనించినప్పుడు అలాంటి వారికి ఈ అడ్వైజరీలు అందిస్తున్నాం.' అని ట్యాక్స్ విభాగం తెలిపింది. ట్యాక్స్ పేయర్స్‌కు అందిస్తున్న ఈ సమాచారం లక్ష్యం.. ఐటీ డిపార్ట్‌మెంట్ కంప్లయన్స్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో వారి అభిప్రాయాన్ని అందించడానికి వారికి అవకాశం కల్పించడమేనని ఐటీ విభాగం తెలిపింది. అవసరమైతే ఇప్పటికే దాఖలు చేసిన వారి రిటర్నులను సవరించడం లేదా దాఖలు చేయకపోతే రిటర్నును దాఖలు చేయడం వంటి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. ట్యాక్స్ పేయర్స్ తమకు అందిన అడ్వైజరీ ప్రకారం స్పందించాలని కోరింది.

అడ్వైజరీ వస్తే ట్యాక్స్ పేయర్స్ ఏం చేయాలి?

పన్ను చెల్లింపుదారులు అడ్వైజరీ అందినట్లయితే వారు సంబంధిత ఐటీ శాఖ పోర్టల్ ద్వారా ఫీడ్‌బ్యాక్ అందించాలి. అవసరమైతే రివైజ్డ్ రిటర్న్స్ ఫైల్ చేయాలి. ఒక వేళ ఇప్పటివరకు ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయకపోతే ఇప్పుడు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ బిలేటెడ్ రిటర్న్స్ ఫైల్ చేసేందుకు ఈ ఆర్థిక ఏడాదికి 2023-24 కోసం డిసెంబర్ 31 లోపు ఫైల్ చేయాల్సి ఉంటుంది.

# ఐటీ దిగ్గజం విప్రో కీలక నిర్ణయం..




దేశంలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి. రోజు రోజుకు కొత్త కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ దిగ్గజం విప్రో కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు కరోనా బారిన పడకుండే ఫ్లెక్సిబుల్ వర్క్ ప్లేస్ విధానాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఆ వివరాలు తెలుసుకుందాం.

దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. కొత్త వేరియంట్ జేఎన్1 భయపడుతోంది. ఈ నేపథ్యంలో ఐటీ దిగ్గజం విప్రో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు వైరస్ బారినపడకుండా తగు చర్యలు తీసుకుంటోంది. అందుకోసం ఫ్లెక్సిబుల్ వర్క్ ప్లేస్ విధానాన్ని అవలంభిస్తున్నట్లు తెలిపింది. క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా, వృత్తి పరమైన వృద్ధి కోసం ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సౌకర్యవంతమైన పని ప్రదేశాన్ని కల్పించనున్నట్లు పేర్కొంది. 'గత నవంబర్ నెల నుంచి పూర్తి స్థాయిలో వ్యాక్సిన్ తీసుకున్న ఉద్యోగులు వారానికి మూడు రోజుల పాటు ఆఫీసులకు వస్తున్నారు. ప్రస్తుతం కరోనా మళ్లీ పెరుగుతున్న క్రమంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆఫీసుల్లో అన్ని రకాల అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే పని వాతావరణాన్ని కల్పిస్తున్నాం.' అని విప్రో ఓ ప్రకటనలో తెలిపింది. మన దేశంలో డిసెంబర్ 23వ తేదీన ఒక్క రోజులోనే కొత్తగా 752 కరోనా కేసులు వచ్చాయి. 2023, మే 21 తర్వాత చూసుకుంటే ఒక్క రోజులే నమోదైన కరోనా కేసుల సంఖ్య ఇదే అత్యధికం. మే 21వ తేదీన ఒక్క రోజులోనే 3,420 కొత్త కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ డేటా సూచిస్తోంది. మరోవైపు.. కరోనా కేసులు పెరుగుతున్న క్రమంలో మరోసారి ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఐటీ కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టెక్ మహీంద్రా వంటివి సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే, ఎలాంటి వివరాలు బయటకు రాలేదు. ఆదివారం వరకం కొత్త వేరియం జేఎన్1 సబ్ వేరియంట్ కేసులు మొత్తం 63 నమోదయ్యాయి. అందులో ఒక్క గోవాలోనే 34 వచ్చాయి. అలాగే మహారాష్ట్రలో 9, కర్నాటకలో 8, కేరళలా 6, తమిళనాడులో 4, తెలంగాణలో 2 కొత్త వేరియంట్ కేసులు వచ్చినట్లు తెలుస్తోంది.




# ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు దెబ్బ మీద దెబ్బ..

భారత్‌లోని రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తోంది. ఇప్పటికే ఆర్థిక మాంద్యం దెబ్బకు ఐటీ కంపెనీలు తీవ్ర అనిశ్చితిలో చిక్కుకుపోగా.. లాభాదాయాలు తగ్గుతున్నాయి. మరోవైపు ఇప్పుడు బిలియన్ డాలర్ల డీల్ రద్దు కావడంతో ఇన్ఫోసిస్ పరిస్థితి మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లు.. అన్న చందంగా తయారైంది. ఇన్ఫోసిస్ సంస్థకు దెబ్బ మీద దెబ్బ తగిలినట్లయింది.

ఇప్పటికే ఒక భారీ ప్రాజెక్ట్ రద్దు అయి ఐటీ రంగంలో హాట్ టాపిక్‌గా మారిన ఇన్ఫోసిస్‌కు మరో షాక్ తగిలింది. కృత్రిమ మేధ ప్రాజెక్ట్ రద్దు అయిందన్న వార్తలతో ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ సుమారు రూ. 7200 కోట్లు పతనమైంది. డిసెంబర్ 26న స్టాక్ మార్కెట్లలో ఆ సంస్థ షేర్లు క్షీణించాయి. దీంతో ఇన్ఫీ మార్కెట్ క్యాప్ ఒక్కరోజే రూ. 7200 కోట్లకుపైగా తగ్గింది. గత సెషన్లో మార్కెట్ ముగిసే సమయంలో ఇన్ఫోసిస్ షేరు ధర రూ. 1562తో పోలిస్తే 1.12 శాతం తగ్గి రూ. 1544 వద్ద ముగిసింది. హించనటువంటి కార్పొరేట్ పరిణామాల నేపథ్యంలో అత్యంత బలమైన ఐటీ రంగ సంస్థలు కూడా బలహీ నంగా ఉండటం.. ప్రస్తుత ఐటీ మార్కెట్‌కు పరిస్థితికి అద్దం పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు విశ్లేషకులు.

షేరు పతనం ఎందుకు?

ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ క్షీణతకు ఒక అంతర్జాతీయ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం రద్దు అవ్వడమే అని తెలుస్తోంది. ఇన్ఫోసిస్ 15 సంవత్సరాల పాటు కంపెనీ ప్లాట్‌ఫామ్స్, కృత్రిమ మేధ సొల్యూషన్స్‌పై పని చేసేందుకు ఒక అంతర్జాతీయ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్థిక మాంద్యం భయాలు, మార్కెట్లలో అనిశ్చితి కారణంగా తాజాగా 1.5 బిలియన్ డాలర్లు ( భారత కరెన్సీలో రూ. 12,450 కోట్లు) విలువైన ఒప్పందాన్ని సదరు కంపెనీ రద్దు చేసుకుంది.

అప్రమత్తంగా ఇన్వెస్టర్లు..

ఈ డీల్ రద్దు కావడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తం అయ్యారు. ప్రాజెక్ట్ క్యాన్సిల్ ఇన్ఫోసిస్ షేర్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్న అంచనాలతో మదుపరులు షేర్లను విక్రయించారు. ఇన్ఫీ కొత్త తరం టెక్నాలజీల్లోకి విస్తరించేందుకు ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందని చాలా మంది ఊహించారు. ప్రాజెక్ట్ క్యాన్సిల్ అవ్వడంతో ఇన్ఫీ ఆదాయ మార్గాలు, వృద్ధి అంచనాలపై నెగెటివ్ ఎఫెక్ట్ చూపింది.

# సైనిక అభిమానులకు చైనా వార్నింగ్



పొరుగు దేశం చైనా.. తన సైనిక ఆయుధాలకు సంబంధించిన ఫోటోలను, వివరాలను సోషల్ మీడియా వేదికల్లో కొందరు పోస్ట్ చేస్తున్నట్టు గుర్తించింది. దీంతో ఇవి దేశ భద్రతకు ప్రమాదకరమని, ఇటువంటి చర్యల వల్ల శత్రువులకు సులువుగా మన ఆయుధాల వివరాలు, స్థావరాల గురించి సమాచారం అందుంతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో చైనా నిఘా వర్గాలు కీలక ప్రకటన చేశాయి. ఫోటోలను పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

దేశంలోని సున్నితమైన సైనిక పరికరాల ఫోటోలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేయవద్దని, అవి జాతీయ భద్రతకు ప్రమాదం కలిగిస్తాయని సైనిక ఔత్సాహికులను చైనా హెచ్చరించింది. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం.. వియ్‌చాట్‌లో చైనా కౌంటర్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఈ హెచ్చరికను పోస్ట్ చేసింది. వందల మిలియన్ల మంది యూజర్లు ఉన్న వీబో వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా సున్నితమైన సైనిక పరికరాల గురించి పెద్ద ఎత్తున సమాచారం వ్యాప్తి చెందుతుందనే ఆందోళన వ్యక్తం చేసిందని తెలిపింది. తన బలగాలను చైనా వేగంగా ఆధునీకరిస్తున్నందున ఈ ఫోటోలు సాధారణ సైట్‌గా మారాయి.

'ఇది మంచి అభిరుచి.. కానీ మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది ఔత్సాహికులు జాతీయ రక్షణకు సంబంధించిన సమాచారాన్ని చట్టవిరుద్ధంగా పొందడం, వాటిని ఇంటర్నెట్‌లో ప్రసారం చేయడం ద్వారా జాతీయ సైనిక భద్రతను తీవ్రంగా ప్రమాదంలో పడేస్తున్నారు' అని చైనా ప్రభుత్వ భద్రతా మంత్రిత్వ శాఖ వీచాట్‌లో పేర్కొన్నట్లు సీఎన్ఎన్ పేర్కొంది.

'సైనిక విమానాశ్ర యాలు, నౌకాశ్రయాలు, జాతీయ రక్షణ,సైనిక పారిశ్రామిక విభాగాలపై దృష్టి సారించి.. వారు నిర్దేశించిన మార్గాల్లో ప్రయాణించే ఫెర్రీలు లేదా విమానాలల్లో టెలిఫోటో లెన్స్‌లు లేదా డ్రోన్‌లతో రహస్యంగా ఫోటో తీశారు' గూఢచారి సంస్థ తెలిపింది. మొదటిసారి లేదా అప్పుడప్పుడు నేరస్థులు హెచ్చరికను మాత్రమే అందుకుంటారు కానీ నియమాన్ని ఉల్లంఘించి పునరావృతం చేసే వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించబడుతుంది' అని ఏజెన్సీ స్పష్టం చేసింది. ఈ ఫోటోలు విమాన వాహక నౌకల వంటి సైనిక పరికరాలలో సాంకేతిక వివరాలను, పురోగతిని బహిర్గతం చేయగలవని.. పోరాట ప్రభావాన్ని విశ్లేషించడానికి ప్రత్యర్థి దళాలు ఉపయోగించవచ్చని హైలెట్ చేసింది.

స్థావరాలు, సైనిక పరికరాల వివరాలను బహిర్గతం చేయడం ద్వారా రక్షణ ప్రణాళికను ప్రభావితం చేస్తుంది అని పేర్కొంది. సైనిక పరికరాలను రహస్యంగా చిత్రీకరించడానికి టెలిఫోటో లెన్స్‌లు, డ్రోన్‌ల వంటి ప్రొఫెషనల్ పరికరాలను ఉపయోగించిన నేరస్థులకు శిక్ష తప్పదని హెచ్చరించినట్టు నివేదిక తెలిపింది. 2021లో ఫుజియాన్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను రహస్యంగా చిత్రీకరించిన ఓ వ్యక్తికి దేశ రహస్యాలను అక్రమంగా పొందారనే ఆరోపణలతో చైనా జైలు శిక్ష విధించింది.

# పొగమంచుతో హైవేపై రోడ్డు ప్రమాదం..

ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే స్థానికులు ఏం చేస్తారు. ఆ ప్రమాదానికి గురైన వాహనాల నుంచి గాయపడిన వారిని బయటికి తీసి.. ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడుతారు. ఘటనకు సంబంధించిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేస్తారు. అయితే ఇక్కడ మాత్రం అంతా రివర్స్ అయింది. ఓ వైపు.. ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఆ వాహన డ్రైవర్ తీవ్ర దుఃఖంలో ఉండగా.. స్థానికులు మాత్రం అందులో నుంచి కోళ్లను ఎత్తుకెళ్లారు.

ఉత్తర భారతంలో చలి పులి భయపెడుతోంది. ఉదయం అయినా దట్టమైన పొగమంచు వీడటం లేదు. ఈ క్రమంలోనే రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వేపై ఇవాళ ఉదయం కొన్ని వాహనాలు ఢీకొన్నాయి. అయితే ఈ వాహనాల్లో ఓ కోళ్ల వ్యాన్ కూడా ఉంది. అయితే ఓ వైపు ప్రమాదం జరిగి.. ఆ వాహనదారులు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా.. మరోవైపు.. స్థానికులు చేతివాటం ప్రదర్శించారు. వ్యాన్ నుంచి కోళ్లను ఎత్తుకెళ్లిపోయారు. వ్యాన్ డోర్లను పగలగొట్టి మరీ స్థానిక ప్రజలు కోళ్లను ఎత్తుకెళ్లడం తీవ్ర సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియోను అక్కడే ఉన్న ఓ వ్యక్తి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దట్టమైన పొగమంచు కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం ఉదయం పలు వాహనాలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. అయితే ఆ వాహనాల్లో కోళ్ల లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రక్కు కూడా ఉంది. అయితే అది గమనించిన వాహనదారులు, స్థానికులు ఆ ట్రక్కులో ఉన్న కోళ్లను తాళాలు పగలగొట్టి మరీ ఎత్తుకెళ్లడం సంచలనంగా మారింది. ఇక కొందరు అయితే ఒకేసారి నాలుగైదు కోళ్లను చేతిలో పట్టుకుని పారిపోయారు. మరికొందరు ఏకంగా సంచుల్లో వేసుకుని అక్కడి నుంచి జారుకున్నారు. అయితే అక్కడే ఉన్న ఆ ట్రక్కు డ్రైవర్.. తన వాహనం నుంచి కోళ్ళు ఎత్తుకెళ్లద్దని వారికి విజ్ఞప్తి చేసినా.. ఎవరూ వినలేదు. అయితే ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఓ వ్యక్తి తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆగ్రా నుంచి కాస్గంజ్‌కు వెళ్తున్న ఓ కోళ్ల ట్రక్కు ఢిల్లీ సమీపంలోని జర్నా నాలా వద్ద దట్టమైన పొగమంచు కారణంగా ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి గురైన వాహనాల్లో కోళ్లను తరలించే ట్రక్కు ఉంది. దాని డ్రైవర్ సునీల్ కుమార్ గాయపడగా.. తనను కాపాడాలని కేకలు వేశాడు. అయితే అది పట్టించుకోని స్థానికులు ఆ ట్రక్కులో ఉన్న కోళ్లను వాహనదారులు, స్థానికులు ఎగబడి మరీ ఎత్తుకెళ్లారు. అయితే రూ. 2.5 లక్షల విలువ చేసే కోళ్లు ఉన్నాయని డ్రైవర్ సునీల్ కుమార్ తెలిపాడు. ఈ ఘటనతో తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని డ్రైవర్ వాపోయాడు. ఈ ఘటనతో సమీపంలో ఉన్న జేవార్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

# కన్నడ వివాదం.. బెంగళూరులో ఉద్రిక్తత

కర్ణాటకలో మరోసారి కన్నడ భాష పరిరక్షణ ఉద్యమం తలెత్తింది. అన్ని దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్ల ముందు ఉండే సైన్ బోర్డులపై కన్నడలోనే పేర్లు రాయాలని రాజధాని బెంగళూరులో కన్నడ పరిరక్షణ సంఘాల నేతలు రెచ్చిపోయారు. నేమ్ బోర్డులను చించేసి.. హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలపై దాడులకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కర్ణాటకలో మరో వివాదం చెలరేగింది. అన్ని దుకాణాల ముందు ఉండే సైన్ బోర్డులపై కన్నడ భాషనే ఉపయోగించాలనే డిమాండ్ వెల్లువెత్తింది. ఈ క్రమంలోనే స్పందించిన బెంగళూరు కార్పొరేషన్.. అందరు దుకాణ దారులకు ఆదేశాలు జారీ చేసింది. నిర్ణీత గడువులోగా దుకాణాల ముందు ఉండే నేమ్ బోర్డులపై కన్నడ భాషలో పేర్లు రాయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే కొందరు కన్నడ పరిరక్షణ సంఘాల నేతలు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఉన్న బోర్డులను ధ్వంసం చేయడం, తొలగించడం చేస్తున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాజధాని బెంగళూరు తీవ్ర ఆందోళనలు, నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. అన్ని దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు తమ సైన్ బోర్డుల్లో స్థానిక కన్నడ భాషనే ఉపయోగించాలని ఇటీవలే బృహత్ బెంగళూర్ మున్సిపాలిటీ పాలికే ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో బెంగళూరులో కన్నడ రక్షా వేదికకు చెందిన కార్యకర్తలు ఓ హోటల్‌ను ధ్వంసం చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. కన్నడ రక్షా వేదిక కార్యకర్తలను అడ్డుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వ తేదీలోగా బెంగళూరు నగరంలోని వాణిజ్య సంస్థలు, హోటళ్లు, రెస్టారెంట్లు.. తమ నేమ్ బోర్డులపై 60 శాతం కన్నడ భాషను ఉపయోగించాలని ఇటీవలె బృహత్ బెంగళూర్ మున్సిపాలిటీ పాలికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. లేని పక్షం లో ఆ దుకాణం ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామ ని.. ఆపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకుం టామని హెచ్చరికలు జారీ చేసింది. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రస్తుత సీఎం సిద్ధ రామయ్య కన్నడ భాషను బాగా ప్రమోట్ చేసే వారు. కర్ణాటకలో నివసించేవారు ఎక్కువగా కన్నడ భాషను ఉపయోగించాలని కోరారు. కన్న డను ప్రోత్సహించేందుకు ఏర్పాటైన ప్రభుత్వ యంత్రాంగం ఆరు నెలల్లోగా కన్నడ నేర్చుకోవాలని బ్యాంకు అధికారులకు ఆదేశాలు కూడా ఇచ్చింది. ఇక బెంగళూరు మెట్రో స్టేష న్లలో హిందీ పేర్లను టేప్‌తో కప్పి ఉంచడం గత కాం గ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే జరిగింది.

# దేశంలో 109 కి చేరిన జేఎన్ 1 వేరియంట్..



దేశంలో కరోనా మహమ్మారి రోజురోజుకూ తీవ్రంగా వ్యాప్తి చెందుతోంది. కొత్తగా దేశంలో 529 కొవిడ్ కేసులు బయటపడినట్లు కేంద్రం తెలిపింది. కరోనా ధాటికి మరో ముగ్గురు బలయ్యారు. ఇక జేఎన్ 1 వేరియంట్ కూడా దేశంలో వేగంగా విజృంభిస్తోంది. ఇప్పటికే దేశంలో 109 జేఎన్ 1 కేసులు వెలుగు చూసినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. దేశంలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటివరకు దేశంలో మొత్తం 109 జేఎన్ 1 సబ్ వేరియంట్ కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. మరోవైపు.. గత 24 గంటల్లో దేశంలో 529 కరోనా కేసులు వెలుగు చూసినట్లు తెలిపింది. కొవిడ్ బారిన పడి మరో ముగ్గురు మృత్యువాత పడినట్లు పేర్కొంది. ఈ కొత్త కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 4093 కి చేరినట్లు వివరించింది. ఇక కరోనాతో చనిపోయిన ముగ్గురిలో ఇద్దరు కర్ణాటకకు చెందిన వారు కాగా.. మరొకరు గుజరాత్‌కు చెందిన వారిగా గుర్తించారు.

కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 ఇప్పటివరకు దేశంలోని 7 రాష్ట్రాల్లో వెలుగుచూసింది. ప్రస్తుతం దేశంలో 109 కేసులకు పెరిగాయి. ఇందులో అత్యధికంగా గుజరాత్‌లో నమోదయ్యాయి. గుజరాత్‌లో జేఎన్ 1 వేరియంట్‌కు సంబంధించిన 34 కేసులు వెలుగు చూశాయి. ఇది కాకుండా గోవాలో 18, కర్ణాటకలో 8, మహారాష్ట్రలో 7, కేరళ 5, రాజస్థాన్ 5, తమిళనాడు 4, తెలంగాణ 2.. జేఎన్ 1 వేరియంట్ కేసులు బయటపడ్డాయి. ఇక కేరళలో గత 24 గంటల్లో 353 మంది రోగులు కరోనా బారిన పడ్డారు. అయితే కేరళలో ఒక్కరోజే 495 మంది రోగులు కోలుకోవడం ఉపశమనం కలిగి స్తోంది. గత 24 గంటల్లో కర్ణాటకలో 74 మందికి, తమిళనాడులో 14 మందికి, గుజరాత్‌లో 9 మందికి కరోనా వైరస్ సోకింది.

మరోవైపు కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తజాగా కర్ణాటక ప్రభుత్వం కొత్త సలహా జారీ చేసింది. దీని ప్రకారం ప్రస్తుతం కరోనా సోకిన వ్యక్తులు 7 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. కరోనా సోకిన వ్యక్తితో పరిచయం ఉన్న వ్యక్తుల పట్ల ఆరా తీయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక బుధవారం ఉదయం 8 గంటల వరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వివరాలు జారీ చేసింది. దేశంలో ఇప్పటివరకు మొత్తం 4.50 కోట్ల కరోనా కేసులు నమోదయ్యాయని.. మరణాల సంఖ్య 5,33,340 కి పెరిగింది.

# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి !

ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా..కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని



కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు

బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ

పూర్తిచేయాలని,

లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

# పంచాయితీ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు

**పసుపు బియ్యంపై ప్రమాణాలు**

**ఒకటి రెండు ఓట్లతో ఓటమి..గెలుపు**

**టాస్ విజేతల్లో ఆనందోత్సాహాలు**





హైదరాబాద్,డిసెంబర్18(ఆర్ఎన్ఎ): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అనేక చిత్ర విచిత్రాలు జరిగాయి. ఒకే కుటుంబంలో కొందరు పరస్పరం పోటీ పడ్డారు. డబ్బులు ఇచ్చిన ఓటేయలేదని కొందరు ఆక్రోశించారు. పసుపు బియ్యం పట్టుకుని ప్రమాణం చేయించారు. దేవుడి ఫోటోమీద ప్రమాణాలు జరిగాయి. ఏతావాత ఓటింగ్ మాత్రం అద్భుతంగా సాగింది. ఒకటి, రెండు, మూడు ఇలా స్వల్ప ఓట్ల తేడాతో పలువురు అభ్యర్థులు గెలుపొందగా, మరికొందరు ఓటమి పాలయ్యారు. కొందరికి సమాన ఓట్లు రాగా టాస్ వేసి విజేతలను ప్రకటించారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామంలో ఒక్క ఓటుతో నక్క మల్లేశ్‌ను సర్పంచ్ పదవి వరించింది. మొదట ఒక్క ఓటు అధిక్యం రాగా, రీ కౌం టింగ్‌లోనూ మల్లేశ్‌ను గెలుపు వరించింది. బైంసా మండలం లింగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సుష్మారాణి ఒక్క ఓటుతో గెలుపొందారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గుర్రాలగండిరాజపల్లి లో కాంగ్రెస్ అభ్యర్థి బూస నర్సయ్య ఒక్క ఓటుతో గెలిచారు. నెక్కొండ మండలం అమీన్‌పేటలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి డెక్క చంద్రయ్య తొలుత ఒక్క ఓటుతో గెలువగా, ప్రత్యర్థులు రీ కౌంటింగ్‌కు డిమాండ్ చేశారు. చివరకు కలెక్టర్ జోక్యంతో ఇక్కడ ఫలితాన్ని ప్రకటించినట్టు సమాచారం. కాంగ్రెస్ బలపరిచిన డెక్క ఎల్లయ్యకు 256 ఓట్లు రాగా, బీఆర్ఎస్ బలపరిచిన డెక్క చంద్రయ్యకు 255 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు తేడాతో ఎల్లయ్య గెలిచినట్టు అధికారులు ప్రకటించారు. నెక్కొండ మండలం సీతారాంపురంలో బీఆర్ఎస్ మద్దతునిచ్చిన అభ్యర్థి కట్కూరి విజయలక్ష్మి ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. నెక్కొండ మండలం రెడ్యానాయక్‌తండాలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి అంగోత్ ఉమ రెండు ఓట్ల తేడాతో గెలిచింది. నెక్కొండ మండలం మడిపెల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి అంగోత్ అనూష మూడు ఓట్ల తేడాతో గెలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండ లం భూక్యాతండా సర్పంచ్ స్థానానికి తొలు త ఎనిమిది మంది నామినేషన్ వేశారు. కాంగ్రెస్ బలపరిచిన మదన్‌కు మద్దతు ఇవ్వాలని తండావాసుల నిర్ణయంతో ఆరుగురు విత్ డ్రా చేసుకున్నారు. చివరి రోజు బీఆర్ఎస్ బలపరిచిన రమావత్ శ్రీకాంత్ సైతం విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లగా, మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. మూడో విడతతో మూడు ఓట్ల అధిక్యంతో శ్రీకాంత్ గెలిచాడు. అదృష్టం వరించిన అభ్యర్థులు నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని బెల్గాం తండా సర్పంచ్‌గా జాదవ్ గోకుల్‌దాస్ టాస్ ద్వారా ఎన్నికయ్యాడు. బెల్గాం తండా జీపీలో అనిల్, జాదవ్ గోకుల్‌కు 192 చొప్పున సమాన ఓట్లు వచ్చాయి. దీంతో టాస్ వేయగా అదృష్టం గోకుల్‌ను వరించింది. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని కంఠం గ్రామంలో టాస్ ద్వారా సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అజ్గిరి సాయినాథ్ గెలుపొందారు. ఇబ్రహీంపేట్ జీపీ, బోర్లం క్యాంపు తండాలో ఇద్దరు వార్డు సభ్యులను టాస్ ద్వారా నిర్ణయించారు.

# రీకౌంటింగ్‌లోనూ ఒక్క ఓటుతో విజయం

**రంగాపూర్‌లో విజయం సాధించిన గంట రమేశ్**



పెద్దపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది. ఒక్క ఓటు ఎందరినో గెలిపిస్తుంది అంటుంటారు. సామాన్యుడికి ఓటు వజ్రాయుధం అన్నట్లు.. ఓటుతోనే ఏదైనా సాధించవచ్చని అన్నట్లు.. తలరాతలనే తారుమారు చేసేలా మారింది ఓటు. పెద్దపల్లి మండలం రంగాపూర్ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అదే ఆవిష్కృతమైంది.మూడో విడుత ఎన్నికల సందర్భంగా రంగాపూర్ గ్రామానికి సర్పంచ్ అభ్యర్థులుగా గంట రమేష్, కలబోయిన నరేందర్, ఈర్ల భువన్ తేజ్ పోటీ చేశారు. అయితే ఈ నెల 5న నామినేషన్లతో ప్రారంభమైన ఎన్నికల తంతు బుధవారం జరిగిన ఎన్నికలతో ముగిసింది.ఇక్కడ ఒకే పార్టీలో ఒకే నాయకునికింద ప్రధాన అనుచరులుగా చలామణి అయినవారు ఇప్పుడు ప్రత్యర్థులుగా మారి ఎన్నికల్లో తలపడ్డారు. అయితే హోరాహోరీగా జరిగిన ఎన్నికల ప్రచారంతో టగ్ ఆఫ్ వార్ లా కొనసాగింది. ఈ క్రమంలో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీలోనే పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావుకు ప్రదాన అనుచరులుగా ఉన్న ఇద్దరు నాయకులు ఆ గ్రామానికి మాజీ ప్రజాప్రతినిధులే కావడం విశేషం. అందులో ఒకరు గంట రమేష్ కాగా మరొకరు కలబోయిన మహేందర్ తమ్ముడు నరేందర్. వీరిద్దరు కూడా అదే గ్రామానికి ఒకే పార్టీ నుంచి ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులుగా రంగంలో దిగారు, గత వారం రోజులుగా హోరాహోరీ జరిగిన ప్రచారంలో పోలింగ్ జరిగింది. గంట రమేష్ బ్యాట్ గుర్తుకు 886 ఓట్లు , ప్రత్యర్థి కలబోయిన నరేందర్‌కు 884ఓట్లు వచ్చాయి. అలాగే మరో అభ్యర్థి ఈర్ల భువనతేజకు 5 ఓట్లు పోలవగా, ఒక ఓటు నోటాకు పడింది. పోలైన ఓట్లలో 15ఓట్లు చెల్లకుండా పోయాయి. కెవలం రెండు ఓట్లతో గంట రమేష్ గెలువడం ఇరువర్గాలను ఆందోళనకు గురి చేసింది. పోలైన 15 ఓట్లు చెల్లనివిగాపోవడంతో అవి మాకు సంబంధించినవే అయి ఉండవచ్చని బావించిన ప్రత్యర్థి వర్గంతో పాటు అభ్యర్థి కూడా రీకౌంటింగ్ చేయాలనిపట్టు బట్టడడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోలైన ఓట్లకు రీ కౌంటింగ్ జరిపారు. రీ కౌంటింగ్ అనంతరం గంట రమేష్‌కు ఒక ఓటు తగ్గి 885, కలబోయిన నరేందర్‌కు 884 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్ తర్వాత ఒక ఓటు తగ్గిపోయి ఒకే ఒక్క ఓటుతో గంట రమేష్ తన సమీప ప్రత్యర్థి కలబోయిన నరేందర్‌పై విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఒక్క ఓటు ఇద్దరు అభ్యర్థులకు, వారి అనుచరగణానికీ గంటపాటు చెమటలు కక్కించింది.




**యాదాద్రి భువనగిరి:** పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎవరూ వియోత్సవ ర్యాలీలు జరుపుకోవద్దని కలెక్టర్ హన్మంతరావు ముందే ఆదేశించారు. అన్ని దశల్లో ఎన్నికల ప్రశాంతంగా జరిగాయని అన్నారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాం. ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. విజేతలు విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు జరుపుకోవద్దు. నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. యాదాద్రి జిల్లాలో మూడో విడతలో 92.56 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం1,59,289 మంది ఓటర్లు ఉండగా, 1,47,432 ఓట్లు పోలయ్యా యి. 92.79 శాతంగా ఉన్న 73,640 మంది పురుషు లు, 92.33 శాతంగా ఉన్న 73,792 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు నిర్వహించిన ఆరు మండలాల్లోనూ 90 శాతానికి పైగా రికార్డు స్థాయిలో ఓటింగ్ శాతం నమోదైంది. అత్యధికంగా చౌటుప్పల్ మండలంలో 94.25 శాతం మంది ఓటేశారు. ఆ తర్వాత గుండాలలో 92.83, సంస్థాన్ నారాయణపురంలో 92.44 శాతం, మోటకొండూరులో 92.28, అడ్డగూడూరులో 91.29 శాతం, మోత్కూరులో 90.11 శాతం మంది ఓటేశారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మూడో విడత పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ కొనసాగింది. ఈ మేరకు అధికార యం త్రాంగం ఏర్పాట్లు చేసింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యూలో నిల్చున్న వారికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. జిల్లాలోని

ఆరు మండలాల్లో 114 సర్పంచ్ పదవులు, 993 వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహించారు.

## వల్లభనేని వంశీపై మరో కేసు నమోదు

విజయవాడ: వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊహించని షాక్ తగిలింది. మాచవరం పోలీస్ స్టేషన్‌లో వల్లభనేని వంశీపై గురువారం కేసు నమోదైంది. సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో వంశీపై కేసు నమోదు చేశారు. 2024లో జులైలో తనపై వంశీ ఆయన అనుచరులు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీతో సహా మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సత్యవర్ధన్‌ను వంశీ అండ్ కో కిడ్నాప్ చేసి దాడి చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో వల్లభనేని వంశీ జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. 2023లో గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి జరిగింది. అయితే ఈ దాడిలో ప్రధాన సాక్షిగా సత్యవర్ధన్ ఉన్నారు. ఈ ఘటనలో ఆయన ఇచ్చిన ఫిర్యాదే కీలకంగా మారింది. ఈ క్రమంలో సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే వల్లభనేని వంశీతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు.

# నెక్ట్స్ మూవీ..




**టా**లీవుడ్ ఊర మాస్ సినిమాల స్పెషలిస్ట్ డైరెక్టర్ బోయ పాటి శ్రీను. కెరీర్ ప్రారంభం నుంచీ తనదైన పంథాలో సినిమాలు చేస్తూ వస్తున్నారు. ఆ విధం గానే ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్లు అందుకున్నారు. కొన్ని డిజాస్టర్లు కూడా చవిచూశారు. చివరగా ఆయన్నుంచి వచ్చిన 'అఖండ 2: తాండవం' చిత్రం ఆశించిన స్థాయిలో వసూళ్లను రాబట్టలేకపోయింది. దీంతో బోయపాటి నెక్ట్స్ మూవీ ఏంటి? ఏ హీరో డేట్స్ ఇస్తాడు? అనే చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దర్శకుడి తదుపరి ప్రాజెక్ట్ పై ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

ఇప్పటి వరకూ తెలుగు ప్రేక్షకులకు తన మాస్ ఏంటో చూపించిన బోయపాటి శ్రీను.. ఇప్పుడు తన రూటు మార్చి బాలీవుడ్ వైపు అడుగులు వేస్తున్నారని తెలుస్తోంది. బాక్సాఫీస్ దగ్గర మాస్ మసాలా యాక్షన్ తో సెన్సేషన్ క్రియేట్ చేసే బోయపాటి.. త్వరలోనే ఒక భారీ హిందీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన ఇటీవలే ముంబైలో బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణవీర్ సింగ్ను కలిశారనే వార్త ఇప్పుడు చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది.

బోయపాటి శ్రీను సినిమాలు అంటేనే ఒళ్ళు గగుర్పొడిచే యాక్షన్ సన్నివేశాలు, హై-వోల్టేజ్ మాస్ ఎలిమెంట్స్ ఉంటాయి. గతంలో ఆయన తీసిన తెలుగు చిత్రాలకు ఉత్తరాదిలో కూడా మంచి ఆదరణ లభించింది. యూట్యూబ్ లో ఆయన హిందీ డబ్బింగ్ సినిమాలకు మిలియన్ల వ్యూస్ వస్తుంటాయి. ఇప్పుడు రణవీర్ సింగ్‌తో ఒకవేళ ఆయన సినిమా చేస్తే, పాన్ ఇండియా అప్పీల్ ఉన్న ఊరమాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చేసే అవకాశం ఉంది. రణవీర్ ఎనర్జీకి, బోయపాటి మార్క్ ఎలివేషన్స్ తోడైతే వెండితెరపై పూనకాలు రావడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

కాకపోతే రణవీర్ సింగ్‌తో బోయపాటి శ్రీను ప్రాజెక్ట్ గురించి ఎలాంటి అఫీషియల్ కన్ఫర్మేషన్ లేదు. మనకందిన సమాచారం ప్రకారం, బోయపాటి ఇటీవల ముంబై వెళ్లి రణవీర్ సింగ్‌ను కలిసి ఒక పవర్ ఫుల్ కథను వినిపించారట. ఇది హీరోకి నచ్చి, ప్రాజెక్ట్ ఫైనల్ అయితే మాత్రం బోయపాటికి పెద్ద అవకాశం దొరికినట్లే అని చెప్పాలి. రణవీర్ 'దురంధర్' వంటి భారీ బ్లాక్ బస్టర్ తో మంచి జోరు మీద ఉండటంతో, ఈ కాంబినేషన్ కుదిరితే బాలీవుడ్ రికార్డులు తిరగరాయడం పక్కా అనే కామెంట్స్ వస్తున్నాయి.

# బాక్సాఫీస్ యుద్ధమే



టాలీవుడ్ బాక్సాఫీస్ చరిత్రలో స్టార్‌డమ్‌తో పాటు పోటీని దశాబ్దాలుగా కొనసాగిస్తూ వస్తోన్న హీరోలుగా మెగాస్టార్ చిరంజీవి , నటసింహ నందమూరి బాలకృష్ణ ప్రత్యేక గుర్తింపు పొందారు. వీరిద్దరి సినిమాలు విడుదలైన ప్రతీసారి అభిమానుల్లో సహజంగానే పోలికలు, చర్చలు, అంచనాలు మొదలవుతాయి. ఒక దశలో చిరంజీవి పైచేయి సాధిస్తే, మరో దశలో బాలకృష్ణ తన మార్క్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వీరిద్దరి మధ్య ఉన్న పోటీ ఆరోగ్యకరమైనదే అయినా, గతంలో అభిమానుల మధ్య మాటల యుద్ధాలు, వివాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఇద్దరి సినిమాలు పోటీపడితే ఆ రేంజ్ వేరే స్థాయిలో ఉంటుందన్నది తెలుగు సినీ ప్రేక్షకుల అభిప్రాయం. గతంలోనూ సంక్రాంతికి చిరు--బాలయ్య సినిమాలు బరిలోకి దిగిన సందర్భాలు ఉండటం వల్లే ఈ పోటీకి మరింత వెయిట్ వచ్చింది.

ఇప్పుడు మళ్లీ అదే తరహా ఆసక్తికరమైన చర్చ టాలీవుడ్‌లో నడుస్తోంది. చిరంజీవి, బాలకృష్ణ ఇద్దరూ గ్యాంగ్‌స్టర్ నేపథ్య కథల్లో నటిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న కొత్త చిత్రం గ్యాంగ్‌స్టర్ జానర్‌లో రూపొందనుందట. మాస్ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని పవర్‌ఫుల్ క్యారెక్టర్‌తో చిరును చూపించబోతున్నారని సమాచారం. ఈ చిత్రానికి 'కాకా' అనే టైటిల్ పరిశీలనలో ఉందన్న టాక్ కూడా ఈ వార్తలకి ఊతమిస్తున్నాయి. ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తూ, సంక్రాంతి కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. చిరంజీవిని మళ్లీ ఫుల్ మాస్ అవతార్‌లో చూడాలని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అదే సమయంలో నటసింహ బాలకృష్ణ కూడా గ్యాంగ్‌స్టర్ కథతోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారని వినిపిస్తోంది. 'వీరసింహారెడ్డి' తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేనితో మరోసారి జట్టు కట్టేందుకు బాలయ్య సిద్ధమవుతున్నారు. ఈ ప్రాజెక్టు ముందుగా పౌరాణిక కథతో మొదలుకాగా బడ్జెట్ పరిమితుల వల్ల ఈ కథని పక్కన పెట్టి మరో కథతో బరిలోకి దిగుతున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో బాలకృష్ణ పాత్ర మరింత రఫ్ అండ్ టఫ్‌గా, పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గా ఉంటుందని అంటున్నారు. బాలయ్యకు మాస్ ఇమేజ్ ఉన్న నేపథ్యంలో, గోపీచంద్ మలినేని స్క్రీన్‌పై ఆయనను ఏ స్థాయిలో చూపిస్తారోనన్న ఆసక్తి అభిమానుల్లో ఉంది.



# ఆవేదన



**అం**దం కంటే అభినయానికి ప్రాధాన్యం ఇచ్చే నటీమణిగా ఐశ్వర్యా రాజేశ్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. చెన్నైలో జన్మించి, తమిళ చిత్రసీమలో తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించిన ఐశ్వర్య, పాత్ర ప్రాధాన్యం ఉన్న కథలకే ఎక్కువగా ఓటు వేస్తూ ముందుకెళ్లారు. గ్లామర్ హీరొయిన్ అనే ముద్రకు దూరంగా, సహజ నటనతో ప్రేక్షకులను మెప్పించగల నటిగా ఆమెకు గుర్తింపు వచ్చింది.

కోలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకున్న ఐశ్వర్య, 'కనా' సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. అదే సినిమాను తెలుగులో 'కౌసల్య కృష్ణమూర్తి'గా రీమేక్ చేయడంతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. తొలి సినిమాతోనే నటిగా తన సత్తా చూపించిన ఆమెకు, ఆ తర్వాత 'వరల్డ్ ఫేమస్ లవర్', 'టక్ జగదీష్' వంటి చిత్రాల్లో అవకాశాలు లభించాయి. అయితే, ఇవి పెద్ద కమర్షియల్ హిట్స్‌గా నిలవకపోవడంతో ఆమెకు మాస్ రేంజ్‌లో గుర్తింపు రావడానికి కొంత సమయం పట్టింది. అయినా సరే, పాత్ర ప్రాధాన్యం ఉన్న సినిమాలనే ఎంచుకుంటూ ఐశ్వర్య తన ప్రయాణాన్ని కొనసాగించారు.ఆ లోటును పూడ్చింది మాత్రం ' సంక్రాంతికి వస్తున్నాం '. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ చిత్రంలో భాగ్యలక్ష్మి అనే పాత్రలో ఐశ్వర్య జీవించిన తీరు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

భార్యగా, కుటుంబ బాధ్యతలు మోస్తూ, భర్తకు అండగా నిలిచే పాత్రను ఎంతో సహజంగా ఆమె పోషించారు. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మాత్రమే కాకుండా విమర్శకుల నుంచి కూడా మంచి ప్రశంసలు లభించాయి. గతేడాది సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో, ఐశ్వర్య కెరీర్ పూర్తిగా మారిపోతుందని సినీ వర్గాల్లో చర్చ జరిగింది. ఇకపై పెద్ద హీరోల సినిమాల్లో వరుస అవకాశాలు వస్తాయని భావించారు. కానీ, ఆ అంచనాలు వాస్తవంగా మారలేదు. 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి పెద్ద హిట్ తర్వాత కూడా అగ్ర హీరోల సినిమాల నుంచి పెద్దగా ఆఫర్లు రాకపోవడంపై ఐశ్వర్య తాజాగా ఓ ఇంటర్వ్యూ లో తన ఆవేదనను వ్యక్తం చేశారు.

ఆ సినిమా తర్వాత తనకు మరిన్ని అవకాశాలు వస్తాయని, పెద్ద చిత్రాల్లో నటించే ఛాన్స్ లభిస్తుందని ఆశించానని తెలిపారు. కానీ, 'హీరోయిన్‌గా ఐశ్వర్య చేయగలదా?' అనే సందేహం టాలీవుడ్ దర్శకులు, హీరోలలో ఉందేమోనని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, తన వద్దకు వచ్చిన కథాబలమున్న సినిమాలతో తాను సంతోషంగా ఉన్నానని చెప్పారు.

# డబుల్ డోస్!!




**టా**లీవుడ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. లేటెస్టుగా ఆయన ఖాతాలో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా రూపంలో మరో సక్సెస్ వచ్చి చేరింది. మెగాస్టార్ చిరంజీవి, నయనతార హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ కీలక పాత్ర పోషించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా రూ.360 పైగా కలెక్షన్స్ రాబట్టింది. దీంతో అనిల్ రావిపూడి నెక్ట్స్ మూవీపై ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సంక్రాంతి సీజన్ లో నాలుగు బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టిన అనిల్ రావిపూడి.. వచ్చే ఏడాది సంక్రాంతికి మరో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. తన తదుపరి సినిమా కోసం ఇప్పటికే ఒక ఐడియా క్రాక్ అయిందని అనిల్ ఇటీవల స్వయంగా వెల్లడించారు. ఈసారి సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్ నుంచే ఒక విచిత్రమైన జర్నీ స్టార్ట్ కాబోతోందని, వామ్మో వీడేంట్రా బాబూ అంటారని చెప్పారు. కచ్చితంగా మరో మ్యాజిక్ జరగబోతోందని, టైటిలే విచిత్రంగా ఉంటుందని, త్వరలోనే అనౌన్స్ చేస్తానని తెలిపారు. కానీ ఏ హీరోతో చేస్తారనేది అనిల్ రివీల్ చెయ్యలేదు.

సినీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం, అనిల్ రావిపూడి తన నెక్ట్స్ మూవీ కోసం వెంకటేష్ తో మరోసారి చేతులు కలపబోతున్నారని తెలుస్తోంది. వీరిద్దరి కాంబోలో ఇప్పటికే F 2, F3, 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి నాలుగు చిత్రాలు వచ్చాయి. ఈ హిట్ కాంబినేషన్ లో ఐదో సినిమా రాబోతోందని తెలుస్తోంది. మళ్లీ సంక్రాంతినే టార్గెట్ గా పెట్టుకొని స్క్రిప్ట్ రెడీ చేసుకొని, సెట్స్ మీదకు తీసుకెళ్లేలా పాన్ చేసుకుంటున్నారట. తాజాగా వినిపిస్తున్న టాక్ ప్రకారం, ఈ ప్రాజెక్ట్ గురించి మరో ఆసక్తికరమైన విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.టాలీవుడ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. లేటెస్టుగా ఆయన ఖాతాలో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా రూపంలో అనిల్ రావిపూడి-వెంకటేష్ కాంబోలో తెరకెక్కబోయే సినిమాలో మరో హీరో కూడా ఉంటాడని టాక్ నడుస్తోంది. అందు కోసం తమిళ హీరో కార్తీ, మలయాళ హీరో ఫహాద్ ఫాజిల్ పేర్లని పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు దగ్గుబాటి రానా పేరు కూడా వినిపిస్తోంది. ఇప్పటికైతే ఇవన్నీ గాసిప్స్ మాత్రమే. త్వరలోనే అన్ని విషయాలను అధికారికంగా ప్రకటిస్తారేమో చూడాలి.

# ఫస్ట్ లుక్



దివంగత సూపర్ స్టార్ కృష్ణ మనుమడు, రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ హీరోగా శ్రీనివాస మంగాపురం సినిమాతో ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఆరెక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో బాలీవుడ్ స్టార్ కిడ్ ప్రజంట్ యూత్ హార్ట్ త్రోబ్ రషా తడాని హీరోయిన్‌గా టాలీ వుడ్‌లో అరంగేట్రం చేస్తోంది. వైజయంతీ మూవీస్ అశ్వినీదత్, ఆనంది ఆర్ట్స్ జెమినీ కిరణ్ సంయు క్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా జీవీ ప్రకాశ్ సంగీతం సమకూరుస్తున్నాడు.ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన టైటిల్, హీరో ఫస్ట్‌లుక్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేయగా తాజాగా సినిమాలో మంగ పాత్ర పోషిస్తున్న కథానాయిక రషా ఫస్ట్ లుక్ రివీల్ చేస్తూ వీడియో గ్లిమ్స్ రిలీజ్ చేశారు.

ఓ పూల తోటలో అచ్చ తెలుగమ్మాయి వేషధారణలో రషా లుక్ అదిరింది. కోటి మంది దేవతలు నా పక్కనుండి వెళ్తున్నా...నేను మాత్రం నిన్నే చూస్తూ ఉంటా.. అని శ్రీను చెబుతున్నట్లు నోట్ పెట్టారు. అంతేగాక బ్యాగ్రౌండ్‌లో వచ్చే విజిల్ సౌండ్ హైలెట్‌గా ఉంది. ఈ సినిమా సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మే నెలలో విడుదలవుతుందని తెలుస్తోంది.

# మరో పాట



యాక్షన్ కింగ్ అర్జున్ తన కూతురు ఐశ్వర్యను హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం చేస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం సీతా పయనం ఈ సినిమాతో కన్నడ స్టార్ ఉపేంద్ర అన్న కుమారుడు నిరంజన్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. అర్జున్ స్వయంగా సినిమాను నిర్మించడంతో పాటు దర్శకత్వం వహి స్తుండడం విశేషం. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఆ సినిమా ఫిబ్రవరి 6న థియేటర్లకు రానుంది. కాగా ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన టీజర్, పాటలు ఒకదాన్ని మించి మరోటి విజయం సాధించడమే గాక సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా పయపమే పయనమే అంటూ సాగే సెన్సిబుల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటకు కాసర్ల శ్యాం సాహిత్యం అందించగా స్వీయ సంగీతంలో అనూప్ రూబెన్స్ మరో సింగర్ సత్య ప్రకాశ్‌తో కలిసి ఆలపించారు. గత పాటల్లానే ఈ పాట కూడా వినగానే కరెక్ట్ అయ్యేలా అట్రాక్టివ్‌గా ఉంది. విజువల్స్ కూడా బావున్నాయి. మీరూ ఓ లుక్కేయండి.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.